
షణ్ముఖ SHANMUKHAVELUGU APTEL/2023/89152

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు తెలుగు దినపత్రిక

సంపుటి : 1 సంచిక : 330 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ బుధవారం 16 అక్టోబర్ 2024 పేజీలు 8 : వెల 5/- ఒంగోలు

VOLUME : 01 ISSUE : 330 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Wednesday 16 October 2024 PAGES : 8 PRICE : 5/-




## ఏపీలో జిల్లాలకు ఇన్‌చార్జి మంత్రుల నియామకం

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

విజయనగరం జిల్లాకు అనిత

మన్యం, కోనసీమ జిల్లాలకు అచ్చెన్నాయుడు

ఏలూరు జిల్లాకు నాదెండ్ల మనోహర్

కొందరు మంత్రులకు రెండేసి జిల్లాల బాధ్యతలు

అమరావతి

ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో దూకుడు పెంచుతున్నారు. ఇందులో భాగంగా ఈరోజు రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు ఇన్చార్జి మంత్రులను నియమించారు. జిల్లాల వారీగా ఇన్చార్జి మంత్రులు వీరే:

శ్రీకాకుళం – కొండపల్లి శ్రీనివాస్

విజయనగరం – వంగలపూడి అనిత

పార్వతీపురం మన్యం, కోనసీమ జిల్లాలు – అచ్చెన్నాయుడు

విశాఖపట్నం – డోలా బాలవీరాంజనేయ స్వామి - మిగతా 2లో

# వార్నింగ్ తప్పదా?

- 18న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సీఎం చంద్రబాబు భేటీ..
- మద్యం, ఇసుక వ్యవహారాలలో ఎమ్మెల్యేల జోక్యం చేసుకోవడంపై కూడా ముఖ్యమంత్రి సీరియస్‌గా ఉన్నట్లు సమాచారం
- ఎమ్మెల్సీ ఎన్నికలపై కూడా ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేయాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు.
- కొంతమంది ఎమ్మెల్యేలు నియోజకవర్గాలలో చేస్తున్న దందాలపై కూడా సీఎం చంద్రబాబు వార్నింగ్ ఇవ్వనున్న ట్లు తెలుస్తోంది.
- మరోవైపు కొత్త మద్యం షాపుల వ్యవహారంలో తలదూర్చవద్దని కూటమి ఎమ్మెల్యేలకు సీఎం చంద్రబాబు ఇదివరకే హెచ్చరించారు.



అమరావతి

తెలుగుదేశం ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భేటీ అవనున్నారు. ఈనెల 18న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సమావేశం అవనున్న సీఎం.. పార్టీ బలోపేతం, సభ్యత్వం, ప్రభుత్వ విధానాలపై చర్చించనున్నారు. మద్యం, ఇసుక వ్యవహారాలలో ఎమ్మెల్యేల జోక్యం చేసుకోవడంపై కూడా ముఖ్యమంత్రి సీరియస్‌గా ఉన్నట్లు సమాచారం. అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీపరంగా ఎమ్మెల్యేలతో తొలిసారిగా చంద్రబాబు భేటీ అవుతున్నారు. అలాగే ఎమ్మెల్సీ ఎన్నికలపై కూడా ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేయాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. ఈ క్రమంలో సమావేశానికి సంబంధించి ఎజెండాను పార్టీ కేంద్ర కార్యాలయం తయారు చేస్తోంది. కొంతమంది ఎమ్మెల్యేలు నియోజకవర్గాలలో చేస్తున్న దందాలపై కూడా సీఎం చంద్రబాబు వార్నింగ్ ఇవ్వనున్న ట్లు తెలుస్తోంది. మద్యం దుకాణాలను దక్కించుకునేందుకు... దరఖాస్తుల దాఖలు దశలోనే పలువురు ఎమ్మెల్యేలు జోక్యం చేసుకున్న సంగతి తెలిసిందే. మద్యం దుకాణాల కోసం లక్ష దరఖాస్తులు వస్తాయని, తద్వారా రూ.2 వేల - మిగతా 2లో



## ఐఏఎస్‌లకు చుక్కెదురు

- డీవోపీటీ ఇచ్చిన ఆదేశాలు పాటించాలన్న క్యాట్
- ఇటీవల సొంత రాష్ట్రాల క్యాడర్ లకు పలువురు ఐఏఎస్‌ల బదిలీ
- క్యాట్‌ను ఆశ్రయించిన ఆమ్రపాలి, వాకాటి కరుణ, వాణీ ప్రసాద్, సృజన
- నేడు ఐఏఎస్‌ల పిటిషన్లను విచారించిన క్యాట్
- డీవోపీటీ ఉత్తర్వులపై మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు నిరాకరణ

## వైఎస్సార్‌సీపీ నేత సజ్జలపై లుకౌట్ నోటీసు

- తిరుమల కల్తీ నెయ్యి దర్యాప్తునకు సిట్ సభ్యులుగా ఇద్దరి పేర్లు పంపాం
- టీడీపీ కేంద్ర కార్యాలయం, గన్నవరం టీడీపీ ఆఫీసుపై దాడి కేసు సీఐడీకి బదిలీ
- ఏపీ డీజీపీ ద్వారకా తిరుమలరావు.. వైసీపీ నేతలను వెంటాడుతున్న కేసులు
- ఢిల్లీ ఎయిర్ పోర్టు వద్ద సజ్జలకు ఊహించని అనుభవం
- సజ్జలపై గతంలో గుంటూరు ఎస్పీ లుకౌట్ నోటీసులు ఇచ్చారన్న డీజీపీ



2లో

## ఏపీలో మందుబాబులకు ప్రభుత్వం షాక్

- మద్యం అమ్మకాలపై కాకుండా అదనంగా 2 శాతం డ్రగ్స్ నియంత్రణ సెస్ విధిస్తూ ఉత్తర్వులు
- మద్యంపై 2 శాతం సెస్ విధించిన ఏపీ ప్రభుత్వం
- రేపటి నుంచి ప్రారంభం కానున్న కొత్త వైన్ షాపులు
- రిహాబిలిటేషన్ సెస్ విధించిన ఏపీ ప్రభుత్వం
- ఈ ఆదాయాన్ని డ్రగ్స్ నియంత్రణ, రిహాబిలిటేషన్ సెంటర్లకు వినియోగిస్తామని వెల్లడి



అమరావతి

ఏపీలో నేటి నుంచి కొత్త వైన్ షాపులు ప్రారంభం కానున్నాయి. దీనికి ఒక రోజు ముందే రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మద్యంపై 2 శాతం సెస్ విధిస్తున్నట్టు ప్రకటించింది. దీని ద్వారా వచ్చిన ఆదాయాన్ని డ్రగ్స్ నియంత్రణ, రిహాబిలిటేషన్ సెంటర్లకు వినియోగిస్తామని ప్రభుత్వం తెలిపింది. దీనికి తోడు, మద్యం కొనుగోళ్లలో చిల్లర సమస్య రాకుండా ప్రివిలేజ్ ఫీజు కింద ఎమ్మార్పీపై రూ. 10 మేర పెంచేలా ప్రభుత్వం సవరణ చేసింది. అంటే... మద్యం బాటిల్ ఎమ్మార్పీ ధర రూ. 150.50గా ఉంటే... దాన్ని రూ. 160 చేసేలా అదనపు ప్రివిలేజ్ ఫీజు ఉంటుంది. ఎమ్మార్పీ ధరల్లో చిల్లర సర్దుబాటు చేస్తూ, రౌండ్ ఫిగర్ ఉండేలా - మిగతా 2లో



## అమెరికా-భారత్ మధ్య భారీ డిఫెన్స్ డీల్

- రూ.31వేలకోట్లతో ప్రిడేటర్ డ్రోన్స్ కొనుగోలుకు ఒప్పందం..
- ఈ ఒప్పందం విషయంలో ఇరుదేశాల మధ్య చాలాకాలంగా చర్చలు
- ఈ డ్రోన్ల సహాయంతో మరింత పెరగనున్న భారతదేశ నిఘా సామర్థ్యం
- ఈ ఒప్పందానికి రక్షణ వ్యవహారాల కేబినెట్ కమిటీ గతవారం ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే
- 15 డ్రోన్స్ నేవీకి, మరో ఎనిమిది వైమానిక దళం, మరో ఎనిమిది ఆర్మీకి కేటాయింపు

## మహిళలపై జరిగిన అత్యాచార కేసుల విచారణకు ప్రత్యేక కోర్టు

- రాష్ట్రంలో మహిళలు, చిన్నారుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత
- హెూం శాఖ మంత్రి వంగలపూడి అనిత
- అత్యాచారాలకు, దాడులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు ఏ మాత్రం వెనుకాడే ప్రసక్తే లేదు
- పోలీసులకు ఆయుధాల్లాగే ప్రజలకు మొబైల్ ఫోన్‌లు కూడా ఉన్నాయి
- వాటిని వినియోగించి నేర నియంత్రణకు సహకరించాలి
- సీసీ కెమెరాల ద్వారా నిఘా పెట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం




అమరావతి

రాష్ట్రంలోని శ్రీసత్యసాయి, బాపట్ల జిల్లాలో జరిగిన అత్యాచార ఘటనల కేసులకు సంబంధించిన నిందితులకు త్వరితగతిన శిక్ష పడేందుకు ప్రత్యేక కోర్టుల ద్వారా విచారణ చేపట్టేలా హైకోర్టును కోరనున్నట్లు రాష్ట్ర హెూం మంత్రి వంగలపూడి అనిత వెల్లడించారు. మంగళవారం రాష్ట్ర సచివాలయం నాల్గో బ్లాక్ పబ్లిసిటీ సెల్‌లో డీజీపీ ద్వారకా తిరుమలరావు, లా అండ్ ఆర్డర్ ఐజీ . శ్రీకాంత్‌తో కలసి హెూం మంత్రి మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత నిస్తున్నదని, అత్యాచారాలకు, దాడులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు ఏ మాత్రం వెనుకాడే ప్రసక్తే లేదని రాష్ట్ర హెూమ్ మరియు విపత్తుల నిర్వహణ శాఖ - మిగతా 2లో

## మోగిన ఎన్నికల నగారా..

- మహారాష్ట్ర, జార్ఖాండ్ ఎన్నికల షెడ్యూల్ ఇదే
- మహారాష్ట్రలో మొత్తం 288 స్థానాలకు ఒకే విడతలో ఎన్నికలు
- అక్టోబర్ 22న నోటిఫికేషన్ విడుదల.. 29వ తేదీ వరకూ నామినేషన్ల స్వీకరణ
- నవంబర్ 20న ఎన్నికలు నిర్వహించి.. 23న ఫలితాల వెల్లడి
- జార్ఖాండ్ 81 అసెంబ్లీ స్థానాలకు గానూ రెండు విడతల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు
- తొలి విడతలో 43 స్థానాలకు నవంబర్ 13న ఎన్నికలు
- మీడియాకు స్వీయ నియంత్రణ అవసరం. ఎన్నికల ప్రక్రియ మొత్తం వెబ్‌కాస్టింగ్ చేస్తున్నాం
- ఫిర్యాదుల స్వీకరణకు సీ విజిల్ యాప్ అందుబాటులో ఉంటుంది
- సీఈసీ రాజీవ్ కుమార్



# మహిళలపై జరిగిన అత్యాచార కేసుల విచారణకు ప్రత్యేక కోర్టు

-మొదటిపేజీ తరువాయి

మంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. రాష్ట్రంలో మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రభుత్వం ఇస్తున్న అత్యధిక ప్రాధాన్యతను వివరించారు. రాష్ట్రంలో మహిళలు, చిన్నారుల భద్రతకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అత్యంత ప్రాధాన్యత నిస్తూ తరచుగా డి.జి.పి., పోలీస్ ఉన్నతాధికారులతో సమీక్షలు నిర్వహిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో మహిళలు, చిన్నారులపై ఏ మాత్రం దాడులు, అత్యాచారాలు జరిగిన వెంటనే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పందిస్తూ సంబందిత జిల్లాల ఎస్పీలతో నేరుగా మాట్లాడుతూ పోలీస్ యంత్రాగాన్ని అప్రమత్తం చేయడమే కాకుండా నిందితులను వెంటనే పట్టుకుని శిక్షపడేలా చేయడం జరుగుచున్నదన్నారు.


ఈ నెల 12 వ తేదీన శ్రీ సత్యసాయి జిల్లాలో అత్తా కోడళ్లపై సామూహిక అత్యాచారం జరగడం అనేది ఒక దురదష్టకరమైన సంఘటన అని, అయితే ఈ కేసుకు సంబందించిన నిందితులను 48 గంటల్లోనే పట్టుకుని రిమాండుకు పంపడం జరిగిందన్నారు. దేవీ నవరాత్రుల సందర్భంగా విజయవాడ ఇంద్ర కీలాద్రిపై మరియు తిరుమల్లో బ్రహ్మోత్సవాల సందర్భంగా పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేసే పనుల్లో పోలీసు యంత్రాంగం అంతా నిమగ్నమై ఉన్నప్పటికీ, అత్యాధునికి సాంకేతిక పరిజ్ఞానం సహకారంతో కొండలు కోనలు అనకుండా 200 కి.మి. పాటు వెంటాడి ఐదుగురు నిందితులను 48 గంటల్లోనే



పట్టుకోవడం జరిగిందన్నారు. వీరిలో ఒక నిందితుడు 14 వ ఏట నుండే పలు రేప్ కేసులు, దొంగతనాల్లో ప్రమేయం ఉన్న నేరచరితుడని, అతని పై దాదాపు 37 కేసుల వరకూ నమోదు అయినట్లు ఆమె తెలిపారు. అదే విధంగా బాపట్ల జిల్లాలో ఒక మహిళపై అత్యాచారం జరిపి హత్య చేసిన కేసుకు సంబందించిన నిందితులను కూడా 42 గంటల్లో పట్టుకోవడం జరిగిందన్నారు. ఈ రెండు కేసుల విషయంలో నిందితులకు తక్షణమే కఠిన శిక్షలు పడేలా చూడాలనే ఉద్దేశ్యంతో ప్రత్యేక కోర్టుకు అప్పగించి విచారణ జరిపించాలని ప్రభుత్వం నిర్ణయించిందని, అందుకు తగ్గట్టుగా రాష్ట్ర ఉన్నత న్యాయ స్థానానికి ఒక లేఖను కూడా వ్రాయడం జరుగుచున్నదని ఆమె తెలిపారు. అదే విధంగా రాష్ట్రంలో శాంతి భద్రతలను మరింత పటిష్టంగా అమలు పర్చాలనే లక్ష్యంతో రాష్ర వ్యాప్తంగా అన్ని ముఖ్యమైన కూడళ్లు, ప్రాంతాలు, దేవాలయాలు, చర్చిలు, మసీదులు, ప్రభుత్వ, ప్రైవేటు వసతి గహాలు, కళాశాలలు, పాఠశాలల వద్ద సి.సి. కెమేరాలను పెద్ద ఎత్తున ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆమె తెలిపారు. ప్రైవేటు సంస్థలు, ప్రాంగణాల్లో ఉండే సి.సి. కెమేరాలను పోలీస్ శాఖతో అనుసంధానం చేస్తే వెంటనే నిందితులను పట్టుకునే అవకాశం ఉంటుందని, అందుకు అనుగుణంగా రాష్ట్ర ప్రజలు పోలీస్ శాఖకు సహకరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. సీసీ కెమేరాలు లేని చోట్ల డ్రోన్ల సహకారంతో పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయడం జరుగుచున్నదని, డ్రోన్లు కూడా లేని చోట మొబైల్ ఫోన్ నే ఆయుధంగా ఉపయోగిస్తూ రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణకు రాష్ట్ర ప్రజలు సహకరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. అదే విధంగా పోలీస్ వారి తక్షణ సహకారానికై 112 లేదా 100 కు ఫోన్ చేయాలని ఆమె కోరారు. మహిళలు, చిన్నారులపై జరిగే అత్యాచారాలు, దాడులకు సంబందించిన ఫిర్యాదులు కూడా ఈ నెంబర్లకు చేయవచ్చుని, అయితే ఫిర్యాదు చేసిన వారి వివరాలను గోప్యంగా ఉంచడం జరుగుతుందని, అవసరమైతే వారికి భద్రత కూడా కల్పించడం జరుగుతుందని హెూం మంత్రి అనిత తెలిపారు.

# స్వరూపానంద భూములు వెనక్కి..?

**విశాఖపట్టణం :** గత ఐదేళ్లలో మార్మోగిన పేరు స్వామి స్వరూపానంద. విశాఖ శారదా పీఠానికి చెందిన స్వరూపానంద గత ఐదేళ్ల కాలంలో రాజ గురువుగా మారిపోయారు. 2019లో జగన్ అధికారంలోకి రావడానికి స్వరూపానంద చేసిన యాగాలే కారణమని వైసిపి నేతలు విశ్వసించారు. గత ఐదేళ్లుగా శారదా పీఠానికి క్యూ కట్టారు. పర్వదినం నాడు జగన్ ఆగమేఘాలపై విశాఖ శారదా పీఠంలో వాలిపోయేవారు. అటు స్వామీజీ సైతం రాష్ట్ర ప్రభుత్వ ఆగమ సలహాదారుడిగా వ్యవహరించేవారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో చేర్పులు మార్పులు కూడా చేయించినట్లు ఆరోపణలు ఉండేవి. ఏడాదిలో రెండుసార్లు అయినా జగన్ విశాఖలోని శారదా పీఠాన్ని సందర్శించేవారు. గత ఐదేళ్ల వైసిపి పాలనలో విశాఖ శారదా పీఠానికి ఎంతో ప్రాముఖ్యత ఉండేది. అక్కడ జరిగే ప్రతి కార్యక్రమానికి రాష్ట్రంలో పేరు మోసిన వైసీపీ నేతలు వచ్చేవారు. అయితే ఎన్నికల్లో జగన్ ఓడిపోవడంతో స్వామిజీ కనిపించకుండా పోయారు. అయితే ఒకసారి మాట మార్చారు కూడా. తాను అభిమానించే నేతల్లో చంద్రబాబు ఒకరు చెప్పుకొచ్చారు. మంచి పాలనా దక్షుడిగా కొనియాడారు. అయితే ఇటీవల టీటీడీ లడ్డు వివాదం జాతీయ స్థాయిలో ప్రకంపనలు రేపింది. దేశంలో హిందూ ధార్మిక సంఘాల ప్రతినిధులు, స్వామిజీలు ఖండించారు. కానీ స్వరూపానంద మాత్రం ఎక్కడా కనిపించలేదుఅయితే స్వరూపానంద కేవలం ఏపీ ప్రభుత్వానికి మాత్రమే రాజ గురువు కాదు. తెలంగాణలో కెసిఆర్ కు సైతం రాజ గురువుగా వ్యవహరించారు. వాస్తవానికి 2014 ఎన్నికలకు ముందు కెసిఆర్ స్వరూపానంద నేతృత్వంలో యాగాలు చేశారు. అధికారంలోకి రాగలిగారు. 2018 ఎన్నికల్లో కూడా అంతే. ఎన్నికలకు



ముందు స్వామిజీ యాగం చేశారు. రెండోసారి కెసిఆర్ అధికారంలోకి రాగలిగారు. అప్పుడే తన సన్నిహితుడు స్నేహితుడైన జగన్ కు విన్నవించారు కేసీఆర్. కెసిఆర్ ద్వారా స్వామిజీకి జగన్ దగ్గరయ్యారు. అయితే ఈ ఎన్నికల్లో ఇప్పుడు ఇద్దరూ ఓడిపోవడంతో స్వామిజీ కనుమరుగైపోయారు. అయితే ఆ మధ్యన చంద్రబాబుకు పొగడ్తల వెనుక విశాఖలో శారదా పీఠం భూములు ఉన్నట్లు తెలుస్తోంది. జగన్ హయాంలో భీమిలి బీచ్ సమీపంలో.. విశాఖ శారదా పీఠానికి 15 ఎకరాల భూమిని కేటాయించారు. అక్కడ వైదిక యూనివర్సిటీ ఏర్పాటుకు స్వామిజీ కోరడంతో భూమిని కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నారు. కేవలం నామమాత్రపు ధరగా లక్ష రూపాయలు తీసుకొని 15 ఎకరాల భూమిని కేటాయింపులు చేశారు. బహిరంగ మార్కెట్లు ఆ భూముల ధర 225 కోట్లు గా ఉన్నట్లు తెలుస్తోంది. దీనిపై టిడిపి, జనసేన ఆందోళనలు కూడా చేశాయి. అయితే అప్పట్లో జగన్ సర్కార్ మొండిగా ముందుకెళ్లింది. దీనికి తోడు అదే భూమిని కమర్షియల్ గా మార్చుకుంటానని జగన్ సర్కార్ కు దరఖాస్తు చేసుకున్నారు స్వామిజీ. కానీ ఇంతలోనే ప్రభుత్వం మారిపోయింది. దీంతో చంద్రబాబుకు స్వామిజీ పొగడ్తల వెనుక కారణం అదేనని తెలుస్తోంది. కానీ త్వరలో చంద్రబాబు సర్కార్ స్వామిజీకి షాక్ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ఎంతో విలువైన ఆ భూమిని వెనక్కి తీసుకోనున్నట్లు సమాచారం. అదే జరిగితే స్వామిజీ ఎలా స్పందిస్తారో చూడాలి.

# షర్మిళ రాజకీయం షురూ...

**కడప :** వైయస్ షర్మిళ అంటే తెలియని వారుండరు. నేటి రాజకీయాల్లో ఈమె మాట ఎప్పుడూ వినిపిస్తూనే ఉంది. ప్రస్తుతం ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఉన్న వైయస్ షర్మిళ .. తన రాజకీయ భవిష్యత్ కోసం వడివడిగా అడుగులు వేస్తున్నారనే చెప్పవచ్చు. అయితే పొలిటికల్ ఫ్యామిలీ నుండి వచ్చినా షర్మిళ గురి.. ఏకంగా సీఎం సీటు అయినప్పటికీ ఆ అదృష్టాన్ని పరిక్షించుకోవడానికి ఇంకా సమయం ఉంది. అప్పటిలోగా తాను బలాన్ని పెంచుకోవాలని, ఏపీలో నెంబర్-2 పార్టీగా కాంగ్రెస్ ఉండాలన్న భావనతో షర్మిళ ముందడుగు వేస్తున్నా.. అది ఫలించేనా లేదా అన్నది ఎన్నికల సమయంలో పరిస్థితులను బట్టి చెప్పవచ్చని రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం. ఏపీలో కాంగ్రెస్ పార్టీ పగ్గాలు చేతబట్టిన షర్మిళ.. దివంగత ముఖ్యమంత్రి వైయస్సార్ కుమార్తెగా రాష్ట్ర ప్రజలందరికీ సుపరిచితమే. తన అన్న వైయస్ జగన్ వైసీపీని ఏర్పాటు చేసిన సమయంలో షర్మిళ బ్యాక్ బోన్ అని చెప్పవచ్చు. జగన్ అరెస్ట్ సమయంలో.. నేనున్నా అంటూ రాష్ట్ర పాదయాత్ర నిర్వహించారు ఆమె. ఆ సమయంలో వైసీపీ నెంబర్-2 నేత షర్మిళ అనుకున్నారు అంతా. కానీ పార్టీ అధికారంలోకి రాగానే ఆమె సైడ్ అయ్యారు అలాగే సైలెంట్ అయ్యారు. పొలిటికల్ గా రాణించాలని, ప్రజాసేవలో ఉండాలనే భావన ఉన్న షర్మిళ..



అనూహ్యంగా తెలంగాణలో కొత్త పార్టీ స్థాపించారు. మారిన రాజకీయ పరిణామాలతో ఆమె కాంగ్రెస్ వైపుకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇక్కడే కాంగ్రెస్ వేసిన వ్యూహం ఫలించిందని రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం. ఏపీలో అధికారంలో ఉన్న జగన్, ఎదురుతిరిగి పార్టీ ఏర్పాటు చేసుకోగా.. అన్నకు పోటీగా చెల్లెలిని రంగంలోకి దింపింది కాంగ్రెస్ అధిష్టానం. ఏపీ రాష్ట్ర కాంగ్రెస్ అద్యక్షురాలిగా ప్రకటించి.. ఆల్ పొలిటికల్ పార్టీస్ కి షాకిచ్చిందని చెప్పవచ్చు. ఇటీవల జరిగిన ఎన్నికల సమయంలో అన్ని నియోజకవర్గాలలో కాంగ్రెస్ అభ్యర్థులను నిలబెట్టడంలో షర్మిళ విజయవంతమయ్యారు. కడప ఎంపీగా బరిలో నిలిచిన షర్మిళ దురదృష్టవశాత్తు ఓటమి చవిచూసినా.. గట్టిపోటీ ఇచ్చారని చెప్పవచ్చు. నెక్ట్స్ ఎలక్షన్స్ సమయానికి తనదైన శైలిలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసుకొని.. తన బలం నిరూపించుకొనేందుకు షర్మిళ ఇప్పటి నుండే పావులు కదుపుతున్నారని పొలిటికల్ టాక్. 11 స్థానాలకు పరిమితమైన వైసీపీ.. ప్రజల్లోకి వెళ్లేందుకు ఇప్పటి నుండే గ్రామాల బాట పట్టే అవకాశం ఉంది. దీనికి కారణం పార్టీ వలసల నివారణే అన్నది పొలిటికల్ విశ్లేషకుల అంచనా. వైసీపీ నుండి కాంగ్రెస్ లోకి వలసలు అంత ఈజీ కానప్పటికీ.. చాలా వరకు వైసీపీ నేతలు కాంగ్రెస్ వైపుకు చూస్తున్నారని, కానీ ఎన్నికలకు రెండేళ్లు ముందు పార్టీ తీర్థం పుచ్చుకొనే అవకాశం ఉందని కాంగ్రెస్ నాయకులే తెలుపుతున్నారు. అయితే ఇటీవల కూటమి, వైసీపీపై విమర్శనాస్త్రాలు సంధిస్తున్న షర్మిళ.. సైలెంట్ గా అన్ని నియోజకవర్గాల్లో పార్టీ క్యాడర్ బలం పెంచుకొనే పనిలో ఉన్నారట. ఎలాగైనా నెక్ట్స్ ఎన్నికల సమయానికి తాను అనుకున్న టార్గెట్ చేరుకోవాలని భావిస్తున్న షర్మిళ.. కోరిక నెరవేరుతుందా.. లేదా వేచి చూడాలి. అప్పటిలోగా రాజకీయ ముఖచిత్రంలో ఎన్ని మార్పులు జరుగుతాయో కదా..

## వాటాలు ఇవ్వాల్సిందే
## జేసీ ప్రభాకరరెడ్డి హూకుం

**అనంతపురం :** టీడీపీ నేత, తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. పేకాట క్లబ్‌లు, ఇసుక వ్యాపారం చేసేవారు వారి సంపాదనలో 15 శాతం కమిషన్ ఇవ్వాలని హెచ్చరించారు. ఇదంతా నియోజకవర్గ అభివృద్ధికి వినియోగించాలన్నారు. తాడిపత్రి నియోజకవర్గ అభివృద్ధికి తాను 20 శాతం డబ్బులు ఖర్చు చేస్తానని, తనకు ఒక్క రూపాయి కూడా వద్దన్నారు. దశాబ్దాల నుంచి తాము రాజకీయాల్లో ఉన్నామని, ప్రజలు తమకు అండగా ఉన్నారని.. నియోజకవర్గ అభివృద్ధి ఇలాంటివి తప్పదన్నారు. వారితో పాటు మద్యం షాపు నిర్వాహకులు తనకు 35 శాతం కమిషన్ ఇవ్వాలని హుకూం జారీ చేయడంపై స్థానికంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్ర రాజకీయాల్లో తాడిపత్రి రాజకీయాలు వేరయా అంటున్నారు. ఓవైపు మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తాడ్రిపత్రిలోకి రాలేకపోతున్నారు. మరోవైపు జేసీ వర్గీయులు నియోజకవర్గంలో కొత్త రూల్స్ పెడుతున్నారు. రాజకీయ ప్రత్యర్థులు తాడిపత్రిలో లేకుండా ఉండాలంటూ గతంలోనే జేసీ ప్రభాకర్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇప్పుడు అభివృద్ధి పేరుతో కమిషన్లు ఇవ్వాలని నేరుగా అడగడం నియోజకవర్గంలో హాట్ టాపిక్ అవుతోంది. కమిషన్లుగా తీసుకున్న డబ్బును తాడిపత్రి నియోజకవర్గ అభివృద్ధికి ఖర్చు చేయడం ఏంటని స్థానికులతో పాటు వైసీపీ శ్రేణులు ఆశ్చర్యపోతున్నాయి. అనంతపురం జిల్లాలోని 14 నియోజకవర్గాల్లో తాడిపత్రి నియోజకవర్గం కాస్త వెరైటీ అని చెప్పవచ్చు. అక్కడ రాజకీయాలు భిన్నంగా ఉంటాయి. టీడీపీకి చెందిన నాయకులు, తన అనుచరులే ఇసుక దోచుకుంటున్నారని తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఇటీవల ఓ వీడియో విడుదల చేశారు. పైగా ఆయన కుమారుడు ప్రస్తుత ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి కావడంతో ప్రభుత్వంపై విమర్శలు కూడా వచ్చాయి. గడిచిన అయిదేళ్లుగా తనకు అండగా నిలిచిన నాయకులు, ఇప్పుడు తాడిపత్రిలో ఇసుకను అక్రమంగా దోచుకుని జేబులు నింపుకుంటున్నారని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వంలో ఇసుక తవ్వకాలపై చర్యలు తీసుకోవాలంటూ తాను గ్రీన్ ట్రిబ్యునల్, హైకోర్టులు, అధికారుల చుట్టూ తిరిగి పోరాటం చేస్తే.. ఇప్పుడు తన అనుచరులే ఇసుక దందా చేస్తున్నారని వీడియో రిలీజ్ చేశారు. తాడిపత్రి నియోజకవర్గంలో దాదాపు 2.5 లక్షల మంది ఉంటే, కేవలం 25 మంది ఇసుక దందా చేసి దోచుకుంటున్నారని జేసీ ప్రభాకకర్ రెడ్డి ఆరోపించారు.

## వైఎస్సార్‌సీపీ నేత సజ్జలపై లుకౌట్ నోటీసు

**అమరావతి :** వైఎస్సార్‌సీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డిపై లుకౌట్ నోటీసు ఉందని ఏపీ డీజీపీ ద్వారకా తిరుమల రావు వెల్లడించారు. ఓ కేసులో గుంటూరు జిల్లా ఎస్పీ లుకౌట్ నోటీసు జారీ చేశారని చెప్పారు. సజ్జల రామకృష్ణారెడ్డిని ఢిల్లీ ఎయిర్ పోర్టులో పోలీసులు ఎందుకు ఆపారన్న విషయమై మీడియా మంగళవారం డీజీపీ ద్వారకా తిరుమలరావు దృష్టికి తీసుకెళ్లినప్పుడు డీజీపీ స్పందించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ.. తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి వ్యవహారంలో కేంద్రం చేపట్టే స్వతంత్ర విచారణలో రాష్ట్ర పోలీసుల జోక్యం ఉండదని ఏపీ డీజీపీ ద్వారకా తిరుమలరావు అన్నారు. కల్తీ నెయ్యి కేసులో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్‌ను సుప్రీంకోర్టు అనుమానించలేదని చెప్పారు. ఈ వ్యవహారంలో స్వతంత్ర దర్యాప్తు జరగాలన్న ఉద్దేశంతోనే ప్రత్యేక బృందం ఏర్పాటు చేసిందని వెల్లడించారు. సిట్ సభ్యులుగా సర్వశ్రేష్ఠ త్రిపాఠి, డీఐజీ గోపీనాథ్ జెట్టి పేర్లను పంపామని తెలిపారు. టీడీపీ కేంద్ర కార్యాలయం, గన్నవరం టీడీపీ పార్టీ ఆఫీసులపై దాడి కేసులతో పాటు మరో రెండు కేసులను సీఐడీకి బదిలీ చేసినట్లు డీజీపీ వెల్లడించారు.



ఇక, తిరుమల లడ్డూ అంశంపైనా డీజీపీ స్పందించారు. లడ్డూ కేసులో ఏపీ ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేయడాన్ని సుప్రీంకోర్టు తప్పుబట్టలేదని స్పష్టం చేశారు. స్వతంత్ర దర్యాప్తు జరగాలన్న ఉద్దేశంతోనే సిట్ ఏర్పాటు చేస్తామని సుప్రీం చెప్పిందని వివరణ ఇచ్చారు. ఇద్దరు సీబీఐ అధికారులు, ఇద్దరు రాష్ట్ర పోలీసు అధికారులు, ఒక ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారితో సిట్ ఏర్పాటు చేస్తున్నట్టు సుప్రీంకోర్టు ప్రకటించిందని... ఈ నేపథ్యంలో, ఏపీ ప్రభుత్వం నుంచి సిట్ కు ఐజీ త్రిపాఠి, డీఐజీ గోపీనాథ్ లు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. ఈ సిట్ ఓ స్వతంత్ర విచారణ సంస్థలాగా పనిచేస్తుందని, ఇందులో రాష్ట్ర పోలీసులు జోక్యం ఉందని డీజీపీ స్పష్టం చేశారు.

## ఏపీలో మందుబాబులకు ప్రభుత్వం షాక్

-మొదటిపేజీ తరువాయి

ఈ సవరణ చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో మందుబాబులకు కూటమి ప్రభుత్వం షాక్ ఇచ్చింది. నాణ్యమైన, అందుబాటులో మద్యం ధర ఉంటుందని ప్రకటించి మాట మార్చింది. మద్యం అమ్మకాలపై కాకుండా అదనంగా 2 శాతం డ్రగ్స్ నియంత్రణ సెస్ విధిస్తూ మంగళవారం ఎక్సైజ్ శాఖ ఉత్తర్వులిచ్చింది .

మద్యం టెండర్ల ద్వారా ప్రభుత్వానికి రూ. 1500 కోట్లు ఆదాయం వచ్చింది. మొత్తం ఏపీలోని 26 జిల్లాలో 3396 మద్యం దుకాణాలకు నిన్న లాటరీ ద్వారా ఎంపిక ప్రక్రియను పూర్తి చేశారు. దుకాణాలు దక్కించుకున్న వారు రేపటి నుంచి మద్యం అమ్మకాలను ప్రారంభించనున్నారు.

మద్యం దుకాణాల లైసెన్సులు దక్కించుకున్న వారిని కోసం బెదిరిస్తున్నారన్న నాయకులను ఏపీ సీఎం చంద్రబాబు హెచ్చరించారు. మద్యం, ఇసుక విషయంలో ప్రభుత్వ నిర్ణయానికి కట్టుబడి పనిచేయాలని , ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా ఎవరైనా వ్యవహరిస్తే కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు.

## వార్నింగ్ తప్పదా?

-మొదటిపేజీ తరువాయి

కోట్ల ఆదాయం సమకూరుతుందని మొదట అంచనా వేశారు. కానీ మితిమీరిన రాజకీయ జోక్యంతో మొదట్లో చాలా స్వల్ప సంఖ్యలో దరఖాస్తులు అందాయి. దీనిపై ఎక్సైజ్ శాఖలోనూ ఆందోళన వ్యక్తమైంది. దీనిపై 'దుకాణం మాదే' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. జిల్లాల వారీగా జరుగుతున్న దందాలు, నాయకులు ఎలా జోక్యం చేసుకుంటున్న తీరును సూటిగానే వివరించింది. దీనిపై సీఎం కార్యాలయం తీవ్రంగా స్పందించింది. క్షేత్రస్థాయి నుంచి సమాచారం తెప్పించుకుని, దరఖాస్తులను అడ్డుకుంటున్న వారికి వ్యక్తిగతంగా ఫోన్లు చేసి గట్టిగా హెచ్చరించింది. నేరుగా సీఎం కార్యాలయం నుంచి హెచ్చరికలు రావడంతో ఎమ్మెల్యేలు వెనక్కి తగ్గారు. మరోవైపు ఎక్సైజ్ శాఖ కూడా దరఖాస్తుదారులకు ఆన్‌లైన్‌లో ఎక్కువ వెసులుబాటు కల్పించింది. సమాచారం కోసం ఎక్సైజ్ ఆఫీసుల చుట్టూ తిరిగే పనిలేకుండా మొత్తం వివరాలను ఆన్‌లైన్‌లో పెట్టింది. దీంతో దరఖాస్తుల సంఖ్య క్రమక్రమం పెరిగింది. మరోవైపు కొత్త మద్యం షాపుల వ్యవహారంలో తలదూర్చవద్దని కూటమి ఎమ్మెల్యేలకు సీఎం చంద్రబాబు ఇదివరకే హెచ్చరించారు. "ప్రభుత్వం పారదర్శకంగా కొత్త షాపులను ఏర్పాటు చేస్తోంది. వాటికి ఎవరైనా దరఖాస్తు చేయవచ్చు. వారిని నియంత్రించడానికి, ఒత్తిడి తేవడానికి ఏ ఎమ్మెల్యే ప్రయత్నించినా ఊరుకొనేది లేదు. వ్యాపారాలు చేసుకొనే హక్కు అందరికీ ఉంది. ఎవరూ అడ్డుకోవద్దు. రాజకీయ పరిపాలన అంటే ప్రతిదానిలో తలదూర్చడం కాదు. ప్రజలకు మంచిచేసే పాలన. ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చే ప్రయత్నం చేయవద్దు" అని ఎమ్మెల్యేలను ఉద్దేశించి సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు.

## ఏపీలో జిల్లాలకు ఇన్‌చార్జి మంత్రుల నియామకం

-మొదటిపేజీ తరువాయి

అల్లూరి – గుమ్మడి సంధ్యారాణి
అనకాపల్లి – కొల్లు రవీంద్ర
కాకినాడ – పి నారాయణ
తూర్పుగోదావరి – నిమ్మల రామానాయుడు
పశ్చిమగోదావరి, పల్నాడు జిల్లాలు – గొట్టిపాటి రవికుమార్
ఏలూరు – నాదెండ్ల మనోహర్
కృష్ణా – వాసంశెట్టి సుభాష్
ఎన్టీఆర్ – సత్యకుమార్ యాదవ్
గుంటూరు – కందుల దుర్గేశ్
బాపట్ల – కొలుసు పార్థసారథి
ప్రకాశం – ఆనం రామనారాయణరెడ్డి
నెల్లూరు – మహ్మద్ ఫరూఖ్
కర్నూలు – నిమ్మల రామానాయుడు
నంద్యాల – పయ్యావుల కేశవ్
అనంతపురం – టీజీ భరత్
తిరుపతి, శ్రీ సత్యసాయి జిల్లాలు – అనగాని సత్యప్రసాద్
కడప – ఎస్ సవిత
అన్నమయ్య – బి.సి. జనార్దన్ రెడ్డి
చిత్తూరు – రాంప్రసాద్ రెడ్డి

## మరో వివాదంలో కోనేటి

**తిరుపతి :** సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంకు కాలం కలిసి రాలేదా? ఏదో విధంగా ఆయనను వివాదాలు చుట్టు ముట్టుతున్నాయా? మళ్లీ వార్తల్లోకి రావడానికి కారణమేంటి? తాజాగా ఆడియో టేప్‌లు ఏం చెబుతున్నాయి? దీనిపై మళ్లీ చర్చించుకోవడం ప్రజల వంతైంది. లేటెస్ట్‌గా సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం.. ఓ మహిళతో మాట్లాడిన ఆడియో టేప్ వెలుగులోకి వచ్చింది. నువ్వు చాలా అందంగా ఉన్నావు.. పర్సనాలిటీ చాలా బావుందని వ్యాఖ్యానించారు సదరు ఎమ్మెల్యే. ఈ ఆడియో సోషల్ మీడియా లో వైరల్ అవుతోంది. నెల రోజుల కిందట ఎమ్మెల్యే ఆదిమూలం తనపై అత్యాచారం చేశాడంటూ ఓ మహిళ ముందుకొచ్చింది. అంతేకాదు ఏకంగా వీడియోలు విడుదల చేసింది. ఆ వివాదం ముగియకముందే మరో ఆడియోతో వెలుగులోకి వచ్చారు ఎమ్మెల్యే ఆదిమూలం. సత్యవేడుకు చెందిన టీడీపీకి చెందిన ఓ మహిళా కార్యకర్తను ఎమ్మెల్యే ఆదిమూలం లైంగిక వేధింపుల ఆరోపణలు రావడంతో ఆయనను టీడీపీ హైకమాండ్ సస్పెండ్ చేసింది. ఈ వ్యవహారంలో బాధిత మహిళను న్యాయస్థానం ముందు హాజరై స్వయంగా వివరణ ఇచ్చుకుంది. ఎఫ్ఐఆర్‌లో ప్రస్తావించిన అంశాలన్నీ అవాస్తమని పేర్కొంది. కొద్ది రోజుల కిందట సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తనను వేధిస్తున్నారంటూ టిడిపికి చెందిన ఓ మహిళ నేత ఆరోపించారు. అంతటితో ఆగకుండా తిరుపతిలోని ఓ లాడ్జిలో ఎమ్మెల్యే తనపై లైంగిక దాడి చేశారంటూ సీక్రెట్ కెమెరాతో తీసిన ఫోటోలు, వీడియోను బయటపెట్టారు. ఏకంగా టిడిపి అధిష్టానానికి ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన హై కమాండ్ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పై సస్పెన్షన్ వేటు వేసింది. అదే సమయంలో బాధిత మహిళ నేత ఫిర్యాదు మేరకు కేసు నమోదయింది.

షణ్ముఖ వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు తెలుగు దినపత్రిక
ప్రకాశం


# భారీ వర్షాలకు ఎలాంటి పరిస్థితులనైనా

# ఎదుర్కొనేలా సిద్ధం కండి

## జిల్లా అధికారులకు
## మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి దిశానిర్దేశం





(షణ్ముఖ వెలుగు బ్యూరో, ప్రకాశం, అక్టోబర్ 15) భారీ వర్షాల వలన ఎలాంటి పరిస్థితి తలెత్తినా సమర్థంగా ఎదుర్కొనేలా సన్నద్ధమవ్వాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ, సచివాలయాలు, వాలంటీర్ల శాఖమంత్రి శ్రీ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి స్పష్టం చేశారు. ఈ దిశగా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఆయన దిశానిర్దేశం చేశారు. అల్పపీడనం నేపథ్యంలో జిల్లాలో విస్తృతంగా వర్షాలు కురుస్తున్నందున మంగళవారం ప్రకాశం భవనంలో కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ, ఏఎస్పీ నాగేశ్వరరావుతో కలిసి సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో ఆయన ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు.

**సత్వర స్పందన పై సంతృప్తి :** జిల్లాలోని పరిస్థితి, లోతట్టుప్రాంత ప్రజల తరలింపు, పునరావాస కేంద్రాల ఏర్పాటు, వర్షాలు కురుస్తున్నప్పటికీ వివిధ సేవలలో అంతరాయం కలుగకుండా తీసుకుంటున్న చర్యలు, సంబంధిత శాఖల మధ్య సమన్వయం కోసం వివిధ స్థాయిలలో కంట్రోల్ రూములు ఏర్పాటు చేసిన విధానాన్ని కలెక్టర్ ఈ సందర్భంగా మంత్రికి వివరించారు. వాతావరణ శాఖ హెచ్చరికలతో సత్వరమే స్పందించి ఈ చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. దీనిపై మంత్రి స్పందిస్తూ ఇప్పటివరకు తీసుకున్న చర్యలపై సంతృప్తి వ్యక్తం చేశారు. వచ్చే మూడు రోజులపాటు కూడా మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎట్టి పరిస్థితులలోనూ ప్రాణనష్టం జరుగకుండా చూడాలనీ ఆస్తి నష్టాన్ని కూడా సాధ్యమైనంత నివారించాలని స్పష్టం చేశారు. ఇటీవల బదిలీలు జరిగినందున మండల స్థాయి అధికారులు కొత్తగా వచ్చారని, ఈ దృష్ట్యా స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ క్షేత్రస్థాయి పరిస్థితిని ఎప్పటి కప్పుడు పరిశీలిస్తూ ప్రజలకు ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి చెప్పారు.

**అండగా ప్రభుత్వం . .** ఇప్పటి వరకు కురిసిన వర్షాలు జిల్లాలోని వర్షాభావ ప్రాంతాలలో సాగుకు ఉపయోగకరంగా ఉన్నాయని మంత్రి అన్నారు. అయితే ఇప్పటికే సాగు చేసిన పంటలు దెబ్బతిన్నకుండా తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. పంటలు దెబ్బతింటే ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం రైతులను ఆదుకుంటామని మంత్రి స్పష్టం చేశారు. చేపల వేటకు వెళ్లవద్దని ప్రభుత్వం హెచ్చరించినందున మత్స్యకారులతోపాటు భృతి కోల్పోయిన వారికి సాయంపైనా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో చర్చిస్తామని మంత్రి తెలిపారు. (తరువాయి 4లో...)

# అత్యవసరమైతే తప్ప ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దు

## నేడు కళాశాలలు, పాఠశాలలకు సెలవు
## కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 15) ఈ నెల 16వ తేదీన భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని వాతావరణ శాఖ హెచ్చరించినందున జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాలు, అన్ని యాజమాన్యాలలోని పాఠశాలలు, కాలేజీలకు బుధవారం కూడా సెలవు ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా తెలిపారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు కూడా ఇళ్లలో నుంచి బయటకు రావద్దని ఆమె సూచించారు. భారీ వర్షాల వలన ఎలాంటి పరిస్థితి తలెత్తినా సమర్థంగా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం సర్వసన్నద్ధమై ఉన్నట్లు చెప్పారు.



# పల్లె ప్రగతికి బాటలు వేస్తాం

## మునుపెన్నడూ లేనివిధంగా పంచాయతీలను తీర్చిదిద్దుతాం
## విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్



(షణ్ముఖ వెలుగు, అద్దంకి, అక్టోబర్ 15) కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా రెండవరోజు కొరిశపాడు మండలం పమిడిపాడు గ్రామంలో జరిగిన "పల్లెపండుగ -పంచాయితీ వారోత్సవాలు" కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పమిడిపాడు గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ నిధులు 40 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించదలబెట్టిన పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. వర్షం కురుస్తున్న లెక్క చేయక అభివృద్ధి పనులకు మంత్రి శ్రీకారం చుట్టారు. కొరిశపాడు మండలంలోని అన్ని గ్రామాలకు కలిపి దాదాపుగా రూ.11కోట్ల 80 లక్షల రూపాయలు మంజూరయ్యాయని అన్నారు,ఈ సందర్భంగా స్థానిక ఎస్సీ కాలనీ వాసులు సామాజిక భవనం మరియు మరుగు కాలువల నిర్మాణాలు చేపట్టాలని మంత్రి దృష్టికి తీసుకురాగా త్వరలో మంజూరు చేయడం జరుగుతుందని పల్లె ప్రగతికి బాటలు వేసి,మునుపెన్నడూ లేనివిధంగా పంచాయతీలను తీర్చిదిద్దుతామని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ. 4500 కోట్లతో గ్రామాల అభివృద్ధికి బాటలు వేస్తోందని పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధి కూటమి ప్రభుత్వ ధ్యేయమని అన్నారు, గతంలో ఎన్నడూ లేనివిధంగా రాష్ట్రవ్యాప్తంగా 30వేల పనులకు సుమారు 4500 కోట్లతో అభివృద్ధి పనులు కు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. అద్దంకి నియోజకవర్గంలో సుమారు 60 కోట్లకు పైగా నిధులతో గ్రామాల్లో అంతర్గత సిసి రోడ్లు,డ్రైనేజీ (తరువాయి 4లో...)




# భారీ వర్షాలకు ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేలా సిద్ధం కండి




**వాగుల వద్ద హెచ్చరికలు ..** వర్షాలపై ఆర్.టి.జి.ఎస్. నుంచి రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న హెచ్చరికలను దృష్టిలో ఉంచుకుని చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ముఖ్యంగా కాజ్ వేలపై నీళ్లు ప్రవహిస్తున్నప్పుడు వాటిపై రాకపోకలు సాగించకుండా చూడాలని చెప్పారు. మహిళా పోలీసులు, వి.ఆర్.ఏ.లు. స్థానిక సిబ్బందితో గస్తీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మైకుల ద్వారా ప్రజలకు అప్రమత్తం చేయాలని మంత్రి చెప్పారు. జనావాసాల మధ్య నీళ్లు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

**సమన్వయం అత్యవసరం...** వర్షాల వలన ప్రజలు ఇబ్బంది పడకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి స్పష్టం చేశారు. తాగునీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా చూడడంతోపాటు నీరు కలుషితం కాకుండా నాణ్యతా పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలన్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య పనులు చురుకుగా చేపట్టాలని స్పష్టం చేశారు. విద్యుత్ సరఫరాలో ఆటంకాలు తలెత్తకుండా చూడాలన్నారు.

**సమన్వయం అత్యవసరం...** వర్షాల వలస ప్రజలు ఇబ్బంది పడకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి స్పష్టం చేశారు. తాగునీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా చూడడంతోపాటు నీరు కలుషితం కాకుండా నాణ్యతా పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలన్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య పనులు చురుకుగా చేపట్టాలని స్పష్టం చేశారు. విద్యుత్ సరఫరాలో ఆటంకాలు తలెత్తకుండా చూడాలన్నారు. దీని పై సంబంధిత అధికారులు స్పందిస్తూ శాఖాపరంగా తీసుకున్న చర్యలను వివరించారు. రెవెన్యూ, ఇతర అధికారులతో క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేస్తున్నట్లు ఏ.ఎస్.పి. నాగేశ్వరరావు చెప్పారు. 700 విద్యుత్ స్థంభాలను అందుబాటులో ఉంచామనీ, 300 మంది కార్మికులను సిద్ధంగా ఉంచామని, జిల్లా కార్యాలయంతోపాటు డివిజన్ స్థాయిల్లోనూ కంట్రోల్ రూములు ఏర్పాటు చేశామని విద్యుత్‌శాఖ ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు చెప్పారు. స్నేక్ బైట్ డ్రగ్స్‌తో పాటు అవసరమైన అన్ని మందులను ప్రభుత్వ ఆసుపత్రులలో అందుబాటులో ఉంచామని, పునరావాస కేంద్రాలలో మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నామని డి.ఎం.హెచ్.ఓ. సురేష్ కుమార్ తెలిపారు. ఒంగోలు డివిజన్‌లోని రూరల్ ఏరియాలో మూడు మండలాల పరిధిలో ఐదు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఆర్.డి.ఓ. లక్ష్మీ ప్రసన్న తెలిపారు. పశువులకు అవసరమైన వాక్సిన్ పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచామని జిల్లా పశుసంవర్ధక అధికారి బేబీరాణి చెప్పారు. కూలిపోయిన చెట్ల వలన రోడ్డు రవాణాకు ఆటంకం కలిగితే తొలగించేందుకు మిషన్లు, జె.సి.బి.లను సిద్ధం చేసినట్లు ఆర్అండ్‌బి ఎస్ఈ దేవానంద్ తెలిపారు. పూర్తిస్థాయిలో క్లోరినేషన్ చేసిన తాగునీటిని సరఫరా చేస్తున్నామని ఆర్.డబ్ల్యు.ఎస్. ఈ.ఈ. బాలశంకరరావు చెప్పారు. కాలువలకు గండ్లు పడకుండా పర్యవేక్షిస్తున్నామని, ఏ పరిస్థితినైనా ఎదుర్కొనేలా ఇసుక బస్తాలను సిద్ధం చేసుకున్నామని జరిగేషన్ అధికారులు వివరించారు. ఒంగోలు మున్సిపాలటీ పరిధిలో వర్షపు నీరు నిల్వ ఉండకుండా డ్రైనేజీలను క్లియర్ చేశామని, ఆక్రమణలను ప్రొక్లైన్లతో తొలగించామని కమిషనర్ వెంకటేశ్వరరావు చెప్పారు. తొలుత గ్రీవెన్స్ హాలులో ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి కంట్రోల్ రూమును మంత్రి పరిశీలించారు. విపత్తు నిర్వహణ శాఖ డి.పి.ఎం. మాధురి ఆధ్వర్యంలో 24 గంటలూ పనిచేసేలా ఈ కేంద్రాన్ని నిర్వహిస్తున్నామని కలెక్టర్ వివరించారు. కాగా, ఏ విషయాలకు సంబంధించిన ఫోన్కాల్స్ ఎక్కువగా వస్తున్నాయని ఇందులోని సిబ్బందితో మంత్రి ఆరాతీశారు.

ఆయా సమస్యలను సంబంధిత శాఖల ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సత్వరమే సమన్వయంతో పరిష్కరించేలా చూడాలని ఆయన చెప్పారు. ఈ సమావేశంలో డి.ఆర్.ఓ. ఆర్ శ్రీలత, సి.పి.ఓ. వెంకటేశ్వర్లు, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మానాయక్, మత్స్యశాఖ అధికారి చంద్రశేఖర్ రెడ్డి, వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, ఉద్యాస అధికారి గోపీచంద్. గృహనిర్మాణ అధికారి పి.శ్రీనివాసప్రసాద్, డి.పి.ఓ. జి. వెంకటనాయుడు, డి.టి.సి. సుశీల, ఏ.పి.ఎస్.ఆర్.టి.సి. డి.ఎం. ఓ.శ్రీనివాసులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# పల్లె ప్రగతికి బాటలు వేస్తాం




కాలువలు, గృహాలు,గోకులం షెడ్లు,పంట కాలువలు,ఫారం ఫాండ్ల పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. గత ఐదేళ్ల వైసిపి పాలనలో గ్రామాల్లో ఒక అభివృద్ధి పని జరగలేదని పేర్కొన్నారు జగన్ పాలనలో పంచాయతీలను నిర్వీర్యం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు,కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్ర ప్రగతికి బాటలు వేశారని తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో రోడ్లు త్రాగునీరు, పారిశుద్ధ్యం వీధిలైట్లు ఏర్పాటు చేసి అభివృద్ధి పనులు వేగవంతం చేస్తామని ఆయన వెల్లడించారు. వైసీపీ ప్రభుత్వం సంస్కృతి సంప్రదాయాలను పక్కన పెట్టి గ్రామాలను నాశనం చేసింది. పండుగలకు వేదికగా గ్రామాలు ఉండేవి. కాని వైసీపీ ప్రభుత్వం సంస్కృతి సంప్రదాయాలను పక్కన పెట్టి గ్రామాలను నాశనం చేసిందని,కూటమి ప్రభుత్వం ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేస్తుందన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో నరేగ నిధులను ఉపయోగించి గ్రామాలను అభివృద్ధి చేయడం జరిగిందని. కానీ వైసీపీ ప్రభుత్వం నరేగ నిధులను పక్కదారి పట్టించి జేబులు నింపుకుందని. చంద్రబాబు నాయుడు పాలనలో మాత్రమే గ్రామాల అభివృద్ధి జరుగుతుందని స్పష్టం చేశారు.

**జగన్ పాలనలో జలజీవన్ మిషన్ ను నిర్వీర్యం**

జగన్ పాలనలో జలజీవన్ మిషన్ ను నిర్వీర్యం చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు,ఆ జలజీవన్ మిషన్ లో కూడా 100 కోట్ల స్కాామ్ చేసి పేదలకు మంచినీరు ఇచ్చే విషయంలో కూడా నిధులను దోచుకున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు ఉండే ప్రాంతాల్లో అభివృద్ధి జరగకుండా చేసిన ఘనత వైసీపీదేనని. కూటమి ప్రభుత్వంలో పంచాయతీరాజ్ వ్యవస్థను గాడిలో పెట్టి గ్రామాలకు పూర్వ వైభవం తీసుకొస్తామని తద్వారా గ్రామాల్లో ప్రగతి పుంజుకుంటుందని అందుకు ప్రజల సహకారం ఎంతో అవసరమని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కొరిశపాడు మండల టిడిపి,జన సేన, బిజెపి నాయకులు కార్యకర్తలు అభిమానులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి

## నెల్లూరు జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్



**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, అక్టోబర్ 15)** జిల్లాలో మరో 48 గంటల పాటు అందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ అన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో గడచిన 24 గంటల్లో 80 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదయిందన్నారు. జిల్లాలో 11 మండలాల్లో 100 మిల్లీమీటర్లు పైగా వర్షపాతం నమోదైందన్నారు. జిల్లాలో భారీ వర్షాల వల్ల ఎక్కడ కూడా ప్రజల ప్రాణ ఆస్తి నష్టం జరగలేదని ఆయన చెప్పారు. జిల్లాలో ప్రజలందరూ కూడా మరో 48 నుండి 72 గంటల పాటు అప్రమత్తంగా ఉండాలని ఆయన తెలియజేశారు. భారతీయ వాతావరణ శాఖ మరో 48 గంటల పాటు భారీ వర్షాలు కురుస్తాయని సూచనల మేరకు ప్రజలందరూ కూడా జాగ్రత్తగా ఉండాలన్నారు. జిల్లాలో భారీ వర్షాలను ఎదుర్కొనేందుకు యంత్రాంగం అంతా కూడా సిద్ధంగా ఉందని ఆయన తెలియజేశారు. జిల్లాలో అధికారులందరూ కూడా పనిచేసే చోటే ఉండాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. జిల్లాలో లోతట్టు ప్రాంతాల ప్రజలను అవసరమైన చోట సురక్షిత ప్రాంతాలకు తరలించామన్నారు.ఇతర లోతట్టు ప్రాంతాల్లో ప్రజలను తరలించడానికి సిద్ధంగా ఉన్నామని ఆయన చెప్పారు. జిల్లాలో కావలి, ఆత్మకూరు, సంగం మండలాలలో తుఫాను పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పునరావాస కేంద్రాలలో ప్రజలకు ఆహారం, త్రాగునీరు, పాలు అన్ని రకాల సౌకర్యాలు అందించడానికి తీసుకున్నామని ఆయన చెప్పారు. తుఫాను నేపథ్యంలో కలెక్టరేట్ లో కంట్రోల్ రూమ్ ను ఏర్పాటు చేశామన్నారు. తుఫాను హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు సహాయం కొరకు టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేశామని ఆయన చెప్పారు. జిల్లాలో సోమశిల జలాశయం 78 టీఎంసీల సామర్థ్యం ఉందని ,ప్రస్తుతం 52 టీఎంసీలు వున్నాయని ,వర్షాల వల్ల ఎలాంటి ఇబ్బంది లేదని ఆయన తెలిపారు.

# కృప సేవా చారిటబుల్ ట్రస్ట్ జాయింట్ సెక్రెటరీ అత్తి మంజరి గోపాల్ జన్మదిన వేడుకలు

## వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం

**(షణ్ముఖ వెలుగు, తిరుపతి, అక్టోబర్ 15)**

తిరుపతి జిల్లా గూడూరు పట్టణంలోని నిర్వహిస్తున్న ఓం సాయిరాం చారిటబుల్ ట్రస్ట్ వృద్ధాశ్రమం నందు వృద్ధులు, కృప సేవ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు, గోపాల్ కుటుంబ సభ్యుల నడుమ పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. గూడూరు పట్టణానికి చెందిన అత్తి మంజరి, గోపాల్ భార్య మల్లేశ్వరి ఇద్దరి సహాయ సహకారాలతో మంగళవారం అక్కడ ఉన్న వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గోపాల్ మాట్లాడుతూ సేవ చేయడమే లక్ష్యంగా తమ వంతు సాయంగా మానవత్వంతో ఓం సాయిరాం చారిటబుల్ ట్రస్ట్ వృద్ధ ఆశ్రమంలో ఉన్న వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నామన్నామన్నారు. దేవుడు సహకరిస్తే ఇలాంటి సేవా కార్యక్రమాలు ముందు ముందుకు ఎన్నో కార్యక్రమాలు చేస్తామన్నారు. ఇలాంటి సేవ, సహాయక కార్యక్రమాలు చేయడానికి దయచేసి ప్రతి ఒక్కరూ కూడా ముందుకు వచ్చి నిరుపేదలకు సేవలు అందించాలని గోపాల్ కోరారు. ఈ కార్యక్రమంలో కృప సేవ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు కటకం శ్రీనివాసులు, సెక్రెటరీ పెరిమిటి చెంచయ్య, జాయింట్ సెక్రెటరీ అత్తి మంజరి గోపాల్ వారి భార్య మల్లేశ్వరి, వారి అల్లుడు పర్వతాల రమేష్,కృప సేవ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు సురేంద్రబాబు, ఎస్. కె రఫీ ఓం సాయిరాం చారిటీస్ నిర్వాహరాలు కళ్యాణి, తదితరులు పాల్గొన్నారు.





# ఎంపీపీఎస్ పాఠశాలను సందర్శించిన ఎస్ఐ జీవీ చౌదరి




**(షణ్ముఖ వెలుగు, బల్లికురవ, అక్టోబర్ 15)** బాపట్ల జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మండలంలోని వేమవరం గ్రామం ఎంపీపీఎస్ పాఠశాలను బల్లికురవ ఎస్ఐ జివి చౌదరి మంగళవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని వసతులను పరిశీలించారు.

# అబ్దుల్ కలాం జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలి



**(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, అక్టోబర్ 15)** మాజీ రాష్ట్రపతి మిసైల్ మ్యాన్ ఏపీజే అబ్దుల్ కలాం జీవితాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. మంగళవారం అబ్దుల్ కలాం 93వ జయంతి సందర్భంగా మాచర్ల పట్టణంలోని ఆయన విగ్రహానికి



ఎమ్మెల్యే జూలకంటి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ నిరుపేద కుటుంబం నుంచి భారతదేశం గర్వపడే స్థాయికి ఎదిగిన మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. కలలు కనటం కాదని వాటిని సహకారం చేసుకోవడంలో పట్టుదలతో కృషి చేయాలని ఆయన చెప్పిన సూక్తి ప్రతి ఒక్కరి జీవితాలలో మార్పులు తీసుకొస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ కలాం సేవా సమితి సభ్యులు తెలుగుదేశం పార్టీ నాయకులు కొమ్మెర దుర్గారావు, ఎనుముల కేశవరెడ్డి, కజ్జం సైదయ్య, సూరే ఎలమంద, మేడం నాగేశ్వరరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మౌలిక సదుపాయాల కల్పనకు ఎన్డీఏ ప్రభుత్వం కృషి చేస్తుంది



**(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, అక్టోబర్ 15)** రాష్ట్రంలో ప్రతి గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం కృషి చేస్తూ ఉందని మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. మంగళవారం పల్లె పండుగ సందర్భంగా మాచర్ల మండల పరిధిలోని భైరవనిపాడు, జమ్మలమడక గ్రామాలలో గ్రామంలో సిమెంట్ రోడ్ల నిర్మాణాలకు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ గడచిన ఐదేళ్లలో రాష్ట్రంలో రహదారులు అస్తవ్యస్తంగా తయారయ్యాయని అన్నారు. గ్రామీణ ప్రాంతాలలో సైతం రహదారులు సరిగా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడిన విషయాన్ని ఆయన గుర్తుకు తెచ్చారు. ఎన్డీఏ కూటమి హయాంలో గ్రామీణ ప్రాంతాల్లో అంతర్గత రహదారులతోపాటు తాగునీరు సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు నేరెళ్ల వీరస్వామి, కూరాకుల కోటేశ్వరరావు, గుండాల శ్రీనివాసరావు, గోపిరెడ్డి, జల్లెల కొండలు, గోవిందయ్య, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## ఎస్ఐ కే మాధవరావు



**(షణ్ముఖ వెలుగు, హనుమంతునిపాడు, అక్టోబర్ 15)** మండలంలోని గ్రామాలలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హనుమంతుని పాడు ఎస్సై కే మాధవరావు విజ్ఞప్తి చేశారు. వాహనదారులు, రైతులు, ప్రయాణికులు నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని అన్నారు. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్‌లు చిన్న పిల్లలు ముట్టుకోకుండా చూడాలని, అత్యవసరమైతే తప్ప బయటకి వెళ్లకూడదని, వ్యవసాయ పొలాల దగ్గర బోరు మోటర్ దగ్గర రైతులు అప్రమత్తంగా ఉండాలని అదేవిధంగా మట్టి మిద్దెలో ఉండరాదని భారీ వర్షాల కారణం వలన ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల ప్రజలను కోరారు.చిన్న పిల్లలు ఈత కోసం కుంటలు ,చెరువులు లో దిగి చనిపోయే ప్రమాదం వుంది కాబట్టి తల్లిదండ్రులు అప్రమత్తంగా వుండాలని ,వాహనదారులు వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తగా చూసి నడపాలి అని జారి పడే ప్రమాదం ఉంది. సమస్య ఉంటే వెంటనే ఫోన్ చేసి తెలియజేయాలన్నారు.

# ఏపీజే అబ్దుల్ కలాం జీవితం అందరికీ ఆదర్శనీయం

### కాంగ్రెస్ పార్టీ మార్కాపురం నియోజకవర్గ ఇంచార్జి సయ్యద్ జావీద్ అన్వర్



**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, అక్టోబర్ 15)**

భారత రత్న, మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా దివంగత మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మార్కాపురం నియోజకవర్గ ఇంచార్జి సయ్యద్ జావీద్ అన్వర్ మంగళవారం న ఒక ప్రకటనలో ఘనమైన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేత సయ్యద్ జావీద్ అన్వర్ మాట్లాడుతు దేశ రక్షణ వ్యవస్థకు అను శక్తిని జోడించిన మిస్సైల్ మ్యాన్ ఏపీజే అబ్దుల్ కలాం అని కొనియాడారు. భారతదేశానికి రాష్ట్రపతిగా తన సేవలు అందించారని తెలిపారు. పేపర్ బాయ్ గా పని చేస్తూ ఏరో స్పేస్ ఇంజనీరింగ్ పూర్తి చేశారని, క్షిపణి శాస్త్ర విజ్ఞాన రంగంలో చిరస్మరణీయ సేవలు అందించారని తెలిపారు. ఆయన జీవితంలో సాధించిన ఘనత అందరికీ ఆదర్శనీయమని తెలిపారు. నేటితరం యువత ఏపీజే అబ్దుల్ కలాం ను ఆదర్శంగా తీసుకొని మంచి నడవడికతో జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు.

# సైక్లోన్‌కు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### స్పెషల్ ఆఫీసర్ ఏఈ శ్రీనివాసులు హెచ్చరిక



**(షణ్ముఖ వెలుగు, సూళ్లూరుపేట ఇన్‌ఛార్జి, అక్టోబర్ 15)**

నాయుడుపేట మండలంలోని విన్నమాల గ్రామ సచివాలయం పరిధి లో ఉండే పెరికిలింపాటి కండ్రిగ, కమ్మవారి పాలెం గ్రామాల్లోని ప్రజ లకు ఈ నెల 14వ తేదీ నుంచి 17వ తేదీ వరకు భారీ నుండి అతిభారీ వర్షాలు, ఈదురుగాలులు సంభవించే ప్రమాద హెచ్చరికలు వాతా వరణ శాఖ వారిచ్చిన సూచనలు మేరకు ప్రజలందరూ జాగ్రత్తగా ఉండాలని, ఎలాంటి ప్రాణ హాని, ఆస్థి నష్టం వాటిల్లకుండా అప్రమత్తంగా ఉండా లని, త్రీవ్రమైన వర్షం వల్ల ఇబ్బందులు ఎదురైతే వెంటనే సమాచారం అందించేలా సచివాలయం సిబ్బందిని ఏర్పాటు చేశామని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్టు ప్రజలకు తెలిపారు. ఈ కార్యక్రమం ఆళ్ల రాజగోపాల్‌రెడ్డి, బల్లి ముత్యాలయ్యల ఆధ్వర్యంలో, సైక్లోన్ స్పెషల్ ఆఫీసర్ హౌసింగ్ ఏఈ శ్రీనివాసరావు, పంచాయతీ సెక్రటరీ గోవిందయ్య, సచివాలయం సిబ్బంది పరమ శివయ్య, సాయి కుమార్, సందీప్, జ్యోతి,సాయి వాణిశ్రీ, చెంచు లక్ష్మి, మబ్జాన్, మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

# చెక్ బౌన్స్ కేసులో రూ.5 లక్షల పరిహారం


### ఏడాది పాటు జైలు శిక్ష

**(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, అక్టోబర్ 15)**

గురువాజీపేట గ్రామానికి చెందిన కుమ్మరికుంటప్రమీల (ఉపాధ్యాయుని)అనే ఆమె తమ్మినేనిపల్లి గ్రామానికి చెందిన తమ్మినేని ఫణింద్ర అనే వ్యక్తి నుంచి మూడు లక్షల ఇరవై ఐదు వేలు అప్పు తీసుకోని దాని తాలుకు ఐదు లక్షల చెక్కు ఇవ్వడం జరిగింది. సదరు ఫణింద్ర చెక్కును బ్యాంక్‌లో వేయగా అది బౌన్స్ అవడం జరిగింది. దాని తాలూకు కేసు మూడేళ్లు విచారణ జరిగి 15/10/24 మంగళవారం కనిగిరి జుడిషియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ న్యాయమూర్తి కె భరత్ చంద్ర నిందితురాలు కుమ్మరికుంట ప్రమీలకు ఒక సంవత్సరం జైలు శిక్ష, ఐదు లక్షల రూపాయల పరిహారం విధిస్తూ న్యాయమూర్తి కె భరత్ చంద్ర తీర్పు ఇచ్చారు.

## దేవరపాలెంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి

### నెల్లూరు రూరల్ నియోజకవర్గం పరిధిలోని దేవరపాలెం గ్రామంలో పల్లె పండగ



**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, అక్టోబర్ 15)**

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ పిలుపుమేరకు నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో వారం రోజులపాటు ఈ పల్లె పండగ కార్యక్రమం ఉంటుంది. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో 18 గ్రామాల్లో 2 కోట్ల రూపాయల నిధులతో రోడ్లు,డ్రెయిన్లు మరియు మౌలిక వసతుల కల్పన కోసం కృషి చేస్తామని తెలిపారు.నెల్లూరు రూరల్ నియోజవర్గ అభివృద్దే లక్ష్యంగా నెల్లూరు రూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పనిచేస్తున్నారు. టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి అన్నారు. భవిష్యత్తులో నెల్లూరు రూరల్ నియోజకవర్గం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయటమే మా జెండా, అజెండా పనిచేస్తున్నాం. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ శైలేంద్ర బాబు, టిడిపి నాయకులు ఇందుపూరు శ్రీనివాసులు రెడ్డి, ఎంపిపి బూడిద విజయ్ కుమార్ యాదవ్, శ్రీ వేదగిరి లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ వేమిరెడ్డి సురేంద్ర రెడ్డి, పద్మాకర్‌రెడ్డి, నారాయణరెడ్డి, ముత్యంశెట్టి శీనయ్య, తాటిపర్తి బాబు, ఏడుకొండలు, వెంకటేష్, మండల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సూదనగుంటలో పొలం పిలుస్తుంది




**(షణ్ముఖ వెలుగు, పొదిలి, అక్టోబర్ 15)**

మండలంలోని సూదనగుంట గ్రామ సచివాలయం పరిధిలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా రైతులతో గ్రామసభ నిర్వహించి ఖరీఫ్ 2024 పంట జాబితా వివరాలు రైతులకు చదివి వినిపించారు. పంట నమూనా జాబితాలో ఎలాంటి పొరపాట్లు ఉన్నట్లయితే రెండు రోజుల్లో సంబంధిత గ్రామ వ్యవసాయ సహాయకులకు తెలిపి సరిచేసుకోవాలని తెలిపారు. అలానే పంట నమూనా జాబితాను సోషల్ ఆడిట్‌కు రైతు సేవా కేంద్రం వద్ద ప్రదర్శన ఉంచారు. అనంతరం గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల వలన సజ్జ, కంది మిరప పంటలకు నష్టం ఏమైనా జరిగినదా అని రైతులను అడిగి తెలుసుకున్నారు.




**పంటలపై తుఫాన్ ప్రభావం**

సజ్జ ప్రస్తుతం కంకి దశలో ఉన్నది అలానే కొంతమేర కోసి కుప్పలు వేయడం జరిగినది కుప్పలుగా వేసిన కంకుల పైన టార్పలిన్ పట్టలు కప్పడం జరిగింది. గత రెండు రోజులుగా టార్పాలిన్ పట్టలు తీయక పోవడం వలన కంకులు రంగు మారే ప్రమాదం ఉందని రైతులు తెలిపారు. అలానే పొలంలో ఉన్న కంకులపై బూజు ఏర్పడి రంగు మారడం జరుగుతుందని తెలిపారు. కంది పంటలో నీరు నిలబడితే ఉప్పలం పోయి కందికర్రలు ఎండిపోయే ప్రమాదం ఉందని తెలియజేశారు కందిలో నీరు నిలబడకుండా ఎప్పటికప్పుడు నీరు బయటకు వెళ్లగొట్టాలని రైతులకు తెలిపారు. మిరప పంటలో నీరు నిలబడినట్లైతే వేరుకుళ్ళు వచ్చే ప్రమాదం ఉన్నందున నీరు నిలబడకుండా బయటకు పంపాలని రైతులకు సూచించారు.



**అధిక వర్షాలకు తీసుకోవలసిన జాగ్రత్తలు**

కంది - 3 గ్రాములు కాపర్ ఆక్సి క్లోరైడ్‌ను లీటర్ నీటికి కలిపి తడిపేలా పిచికారీ చేయాలి. పొటాషియం నైట్రేట్ 10 గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి 200 లీటర్ల మందు ద్రావణం పిచికారి చేయాలి. ఎండు తెగులు రాకుండా ఒక గ్రాము కార్బండిజం లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలి. సజ్జ - వర్షపు నీరు నిలవకుండా ఎప్పటికప్పుడు పొలం నుండి తీసివేయాలి. నేలలో తేమ ఎక్కువగా ఉన్న పరిస్థితుల్లో పొటాషియం నైట్రేట్ లేదా 1% నీటిలో కరిగే ఎరువులైన 19-19-19 లేదా 20.20.20 పిచికారి చేయాలి. కోసిన పైరులో గింజ మొలక రాకుండా పాడుకాకుండా ఉండాలంటే వర్షాలు తగ్గిన వెంటనే కంకులపై ఉప్పును 1లీ/50 గ్రాములు కలిపి పిచికారి చేయాలని మండల వ్యవసాయ అధికారి షేక్ జైనులాబ్దిన్ తెలిపారు.

# వరదల సమయంలో ప్రజల వెన్నంటే ఉంటాం

### - ప్రజలకు ఏ అవసరం వచ్చినా, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉంటాం
### - సేవలు అందించేందుకు సిద్ధం - మాజీ మంత్రి కాకాణి





**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, అక్టోబర్ 15)**

సర్వేపల్లి నియోజకవర్గంలోని వరద ప్రభావిత ప్రాంతాలను మాజీ మంత్రి, ఉమ్మడి నెల్లూరు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి సందర్శించారు. వెంకటాచలం మండలంలోని జగనన్న కాలనీలో నూతనంగా ఇళ్ల ప్లాట్లు కేటాయించి, ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారుల కుటుంబాలతో మాట్లాడి, క్షేమ సమాచారం అడిగి తెలుసుకున్నారు. జగనన్న ఇళ్లతో, తాము వరదల సమయంలో వలసలు వెళ్లే అవసరం లేకుండా, పిల్లలు, వృద్ధులతో తాము నిర్మించుకున్న తమ సొంత ఇళ్లలోనే క్షేమంగా ఉన్నామంటూ మహిళలు సంతృప్తి వ్యక్తం చేశారు. నెల్లూరు జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సేవలు అందించడానికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉన్నారు. అధికారం ఉన్నా, లేకపోయినా, పదవులు కోల్పోయినా ప్రజాసేవ విషయంలో మాత్రం ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉండి, సహాయ సహకారాలు అందిస్తాం. సర్వేపల్లి నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లో పర్యటించి, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశాం. నెల్లూరు జిల్లాలో విపత్తు సమయంలో అధికారులు, అధికార పార్టీ నాయకులు పరిపాలనను గాలికి వదిలివేసి, మద్యం షాపుల కేటాయింపులో బిజీబిజీగా ఉండటం దౌర్భాగ్యం. జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా పేదలకు అత్యంత విలువైన స్థలాలు కేటాయించి, ఇళ్లు నిర్మించి ఇవ్వడంతో ఆ కుటుంబాలు సంతోషంగా ఉన్నామన్నారు. వెంకటాచలం మండల కేంద్రంలో చిన్నపాటి వర్షాలకు ఇల్లు కురిసి, ఇళ్లలోకి నీళ్లు వచ్చి దుర్భరమైన జీవితం గడిపిన ఎస్టీ కుటుంబాలు, ఈ రోజు సంతోషంగా జగనన్న కాలనీలో సొంత ఇళ్లు కట్టుకొని ఉండటం ఆత్మసంతృప్తి కలిగించే విషయం. భారీ వర్ష సూచన ఉన్న నేపథ్యంలో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ, నిరంతరం సేవలు కొనసాగిస్తాం. జిల్లా ప్రజానీకానికి మరీ ముఖ్యంగా సర్వేపల్లి నియోజకవర్గ ప్రజానీకానికి ఎప్పుడు ఏ అవసరం వచ్చినా, వెంటనే స్పందించి, సకల చర్యలు చేపడుతామన్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లా ప్రజలు, కందుకూరు నియోజకవర్గంతో సహా ఎటువంటి విపత్కర పరిస్థితి సంభవించినా, ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని, ఎటువంటి భయాందోళనలు లేకుండా ధైర్యంగా ఉండాలని కోరుకుంటున్నట్లు కాకాణి తెలిపారు.

# అక్షరాస్యతతోనే అభివృద్ధి సాధ్యం

### ఉల్లాస్ కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేయాలి
### నిరక్ష్యరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం
### జిల్లా కలెక్టర్ ఆనంద్

**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, అక్టోబర్ 15)**



అక్షరాస్యతతోనే అన్ని రంగాలలో అభివృద్ధి సాధ్యమని జిల్లా కలెక్టర్ ఆనంద్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఉల్లాస్ కార్యక్రమానికి సంబంధించి జిల్లా స్థాయి అధికారులతో కలెక్టరేట్లోని తన చాంబర్లో మంగళవారం కన్వర్జెన్సీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉల్లాస్ కార్యక్రమం అమలుకు జిల్లాకు 19,178 మంది నిరక్షరాస్యులను అభ్యాసకులకు తీర్చిదిద్దడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. 15 సంవత్సరములు పైబడి ఉన్న నిరక్షరాస్యులు అలాగే గతంలో మధ్యలో బడి మానేసినటువంటి వారు ఈ కార్యక్రమం ద్వారా చదువు నేర్చుకోవచ్చున్నారు ఈ కార్యక్రమం ముఖ్యంగా స్వయం సహాయక బృందంలో ఉన్న చదువురాని మహిళలు, ప్రభుత్వ పాఠశాలలో పని చేసే ఆయాలు, వంట చేసేవారు, హెల్పర్లు అలాగే ప్రభుత్వ పాఠశాలలో రాత్రి వాచ్మెన్ గా పనిచేస్తూ చదువురాని వారి కోసం, అంగన్వాడీ కేంద్రాలలో పని చేసే నిరక్షరాస్యులైన ఆయాల కోసం రూపొందించబడిరదని చెప్పారు. ఇది చాలా మంచి కార్యక్రమం అని ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ సంస్థలలో పనిచేసే చదువురాని వారు మొట్టమొదట చదువు నేర్చుకోవాలని తెలియజేశారు . ఈ కార్యక్రమం ఆరు నెలల పాటు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా ఫంక్షనల్ లిటరసీ, ఫైనాన్స్ లిటరసీ డిజిటల్ లిటరసీ మీద ఎక్కువ కేంద్రీకృతం చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించి సర్వే, మ్యాచింగ్ బ్యాచింగ్ ఈ నెల 24వ తేదీకి పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అక్షరాస్యత కేంద్రాల నిర్వహణ కోసం అంగన్వాడీ కేంద్రాలను వినియోగిం చుకునేందుకు అనుమతి ఇవ్వవలసిందిగా పిడి ఐసీడీఎస్ ను ఆదేశించారు. ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలో పనిచేసే చదువురాని ఆయాలను, వంట చేసే వారిని, రాత్రి వాచ్మెన్‌లను గుర్తించి వారికి ఈ కార్యక్రమం ద్వారా లబ్ధి చేకూర్చాలని జిల్లా విద్యాశాఖ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పిడి డిఆర్డిఏ నాగరాజ కుమారి, పిడి ఐసిడిఎస్ హేనాసుజన్, జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి సదారావు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు మాగుంట అభిమానుల దుప్పట్లు పంపిణీ





**(షణ్ముఖ వెలుగు, దర్శి, అక్టోబర్ 15)**

ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా దర్శిలోని భవితా కేంద్రంలో దివ్యాంగ విద్యార్థులకు మాగుంట అభిమానులు ఏర్పాటు చేసిన దుప్పట్లు, ఫ్రూట్స్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. దర్శి నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, కౌన్సిలర్ వీసీరెడ్డి, గుర్రం బాలకృష్ణ , తదితర నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గొట్టిపాటి లక్ష్మి, కేక్ కట్ చేసి మాగుంటకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.

## సమస్యలు వస్తే వెంటనే కంట్రోల్ రూమ్‌లకు తెలపాలి

### మరో 72 గంటల పాటు అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
### జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్

**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, అక్టోబర్ 15)**

జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సమస్యలు వస్తే వెంటనే కంట్రోల్ రూమ్‌లకు తెలియజేయాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ తెలిపారు. పెన్నా బ్రిడ్జికి పడిన గండిని ఎస్పీ కృష్ణకాంత్‌తో కలిసి జిల్లా కలెక్టర్ ఆనంద్ మంగళవారం పరిశీలించారు. నది ఒడ్డున నివసిస్తున్న ప్రజలతో మాట్లాడారు. భారీ వర్షాల దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలన్నారు. సురక్ష ప్రాంతాలకు వెళ్లాలని అధికారులు ఎవరైనా చెప్పారా అని అడగడంతో తెలియజేశారని వారు చెప్పారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున మరో 72 గంటల పాటు అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన అన్నారు. జిల్లాలో ప్రజలు అత్యవసరమైతే తప్ప బయట తిరగవద్దని ఆయన సూచించారు. జిల్లాలో కోస్తా తీర ప్రాంతాలకు సంబంధించిన మండలాలకు చెందిన 42 గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశామని, సముద్రంలోకి వెళ్లిన మత్స్యకారులను తిరిగి తమ గ్రామాలకు రప్పించామని, సముద్రంలో మత్స్యకారులు ఎవరూ లేరని చెప్పారు. మీడియా వారు కూడా తమకు తెలిసిన సమాచారాన్ని కంట్రోల్ రూమ్ కు తెలియజేయాలని సూచించారు. ఈ సమావేశంలో పాల్గొన్న జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ మాట్లాడుతూ జిల్లాలో మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని, జిల్లా ప్రజలందరూ కూడా భారీ వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భారీ వర్షాలు కురుస్తున్నందున వాగులు, వంకల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామని చెప్పారు. సోమశిల జలాశయం వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని ఆయన తెలియజేశారు. భారీ వర్షాలను ఎదుర్కోవడానికి రెవెన్యూ సహకారంతో పోలీసు యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. అనంతరం నెల్లూరు చెరువు అలుగును కలెక్టర్, ఎస్పీ పరిశీలించారు. స్థానిక నాయకులు, గ్రామ కార్యదర్శి అలుగు వివరాలను కలెక్టర్‌కు వివరించారు.

# రోడ్లన్నీ గుంతలమయం

### వర్షం పడితే వాహనదారులకు నరకయాతన
### పట్టించుకోని మున్సిపల్ అధికారులు

**(షణ్ముఖ వెలుగు, నాయుడుపేట, అక్టోబర్ 15)**

తిరుపతి జిల్లా నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలోని గాంధీ మందిరం నుండి ట్రెజరీ ఆఫీస్ మీదుగా వెళ్లే దారి గుంతల మయంగా ఏర్పడుతుంది.. భారీ వర్షాల నేపథ్యంలో గుంతలు నిండా నీరు నిండి రోడ్లు ఏవో గుంతలు ఏవో తెలియక వాహనదారులు మరియు ద్విచక్ర వాహనదారులు. ఇబ్బందులకు గురవుతున్నారు. అంతేకాకుండా కొంతమంది ద్విచక్ర వాహనదారులు గుంతల్లో పడి ఆస్పత్రి పాలు అయిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఇకనైనా ఉన్నత అధికారులు స్పందించి. ఈ రోడ్డు మార్గాన్ని బాగు చేయాలని నాయుడుపేట ప్రజానీకం కోరుకుంటుంది.



# నగరంలో పర్యటించిన కలెక్టర్





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 15)

భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా, నగర మేయర్ గంగాడ సుజాతతో కలసి మంగళవారం ఉదయం ఒంగోలు నగరంలో క్షేత్రస్థాయిలో పర్యటించారు. లోతట్టు ప్రాంతాల్లో వర్షం నీరు నిల్వకుండా పూడికతీత పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని మున్సిపల్ అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. తొలుత జిల్లా కలెక్టర్ పోతురాజు కాలును పరిశీలించారు. ఆ ప్రాంత ప్రజలతో మాట్లాడారు. ఈ ప్రాంతంలో వర్షం నీరు నిల్వకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. అనంతరం కొప్పోలు రోడ్డు లోని జర్నలిస్టు కాలనీ 1వ లైను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా నిన్నా, ఈ రోజు పాఠశాలలకు సెలవు ప్రకటించడం జరిగిందన్నారు. జిల్లాలో కోస్టల్ మండలాలు ఐదు వున్నాయి, ఈ ఐదు కోస్టల్ మండలాల్లో 53 హ్యాబిటేషన్లు వున్నాయి, అందులో పూరి ఇళ్ళను గుర్తించడంతో పాటు 15 పునరావాస కేంద్రాలను గుర్తించడం జరిగిందన్నారు. ఇందులు 5 పునరావాస కేంద్రాలను ఇప్పటికే ఓపెన్ చేసిన సోమవారం నుండి ఆ ప్రాంత ప్రజలకు భోజన వసతులు కల్పించడం జరుగుచున్నదన్నారు. ఒంగోలు, కొత్తపట్నం, నాగులుప్పడపాడు, టంగుటూరు, జరుగుమల్లి, కొండపి మండలాల్లో 75 మి. మీ వర్షపాతం నమోదు కావడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. వాగులు, కల్వర్ట్ లలో నీరు వెళ్లేందుకు ఎలాంటి ఆటంకం ఉండకుండా చర్యలు తీసుకోవడం జరుగుచున్నదన్నారు. వాగులు వంకల్లో, సైడు కాలువల్లో, అన్నిచోట్ల డ్రైనేజీలలో పేరుకుపోయిన చెత్తను, పూడికతీత పనులు యుద్ధప్రాతిపదికన చేపట్టడం జరుగుచున్నదని కలెక్టర్ వివరించారు. ఆయా ప్రాంతాల్లో విఆర్వోలు, వార్డు అమినిటీ, శానిటేషన్ సెక్రటరీలను నియమించి పనులు చేపట్టడం జరుగుచున్నదన్నారు. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి అవసరమైన ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ వివరించారు. అన్నీ శాఖల అధికారులను సమన్వయం చేసుకొని ఎప్పటికప్పుడు వారిని అప్రమత్తం చేస్తూ జిల్లా యంత్రాంగం అవసరమైన ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లా కలెక్టర్ వెంట నగరపాలక సంస్థ కమిషనర్ వేంకటేశ్వరరావు, ఆర్డీవో లక్ష్మి ప్రసన్న, మున్సిపల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఒంగోలు ఎంపి మాగుంటకు జన్మదిన శుభాకాంక్షలు



(షణ్ముఖ వెలుగు, సింగరాయకొండ, అక్టోబర్ 15)

ప్రముఖ పారిశ్రామికవేత్త అన్ని వర్గాల ప్రజలకు సుపరిచితుడు అందరివాడు వేలాదిమంది ప్రజలకు నిత్యం తమ తమ కంపెనీలలో జీవనోపాధి కల్పిస్తూ ప్రజల హృదయాలను గెలుచుకుంటున్న అందరివాడు రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా ప్రజాసేవే నా ధ్యేయంగా భావించి తన వద్దకు వచ్చిన ప్రతి ఒక్కరికి ఎలాంటి పార్టీలు చూడకుండా సంబంధిత శాఖ అధికారుల ద్వారా సత్వరమే పనులు చేయిస్తూ ప్రజా పరిపాలనపై మరో అడుగు ముందుకు వేసి అభివృద్ధి పథంలో ఒంగోలు పార్లమెంటు పరిధిలో ఉన్న అన్ని మండలాల్లో ప్రజలకు అవసరమైన సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడమే కాకుండా నేను ఉన్నాను అంటూ ప్రజలకు భరోసా కల్పిస్తూ ప్రజల్లో చెరగని ముద్ర వేయించుకుంటున్న మీ మా మనందరి ప్రియతమ నేత తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు ఒంగోలు పార్లమెంటు సభ్యుడు మాగుంట శ్రీనివాస రెడ్డికి ప్రత్యేకంగా ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలం మూలగుంటపాడు గ్రామపంచాయతీ నివాసి యాదవ ప్రముఖుడు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు అయిన మోటుపల్లి కిషోర్ యాదవ్ ప్రత్యేకంగా మాగుంట కార్యాలయంలో మాగుంట శ్రీనివాస్ రెడ్డిని కలిసి ముందుగా ఆయనకి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులరెడ్డి తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు మోటుపల్లి కిషోర్ యాదవ్‌ని ప్రత్యేకంగా తన కార్యాలయంలో అభినందించారు.

## అంతా దోమల మయం




(షణ్ముఖ వెలుగు, కంభం, అక్టోబర్ 15)

కంభం పట్టణంలోని అర్బన్ కాలనీ పరిసరాలలో ఇంటింటి దగ్గర మురికి నీరు నిల్వ ఉన్నా శుభ్రం చేసే వెళ్లే లేరు. విషజ్వరాలు విపరీతంగా పెరిగిపోతున్నా సంభంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు వాపోతున్నారు. ఈ మధ్య నామమాత్రంగా నీళ్లలో పౌడర్ వేసి అక్కడక్కడ చల్లిపోయారని కనీసం మిషిన్ కూడా లేకుండా డబ్బాతో పోసి వెళ్లిపోయారని ఇదేమిటి అని అడిగితే ఒక బస్తా బ్లీచింగ్ పూర్తి కాలనీ మొత్తం రావాలని అధికారులు చెప్పారని చెబుతున్నారని ఇక్కడ దాదాపు అందరి ఇళ్లలో జ్వరాలు వచ్చి చాలా ఇబ్బందులు పడుతున్నామని ఎటుచూసిన మురుకి నీరు ఈ మురుకి నీళ్లమధ్య దూర్వసన వస్తుందని విషసర్పాలు ఇంట్లోకి వస్తున్నాయని పిల్లలు పెద్దలు వృద్ధులు భయం భయంగా జీవిస్తున్నామని దయచేసి మా గోడు ఆలకించి ఇప్పటికైనా సంభంధిత అధికారులు ఎన్నో సంవత్సరాలనుండి ఎదుర్కొంటున్న డ్రైనేజి సమస్యలు పరిష్కరించాలని చేతులు జోడించి వేడుకుంటున్నారు.

# పల్లె ప్రగతికి శ్రీకారం

### పల్లె వెలుగు కార్యక్రమంలో సిసి రోడ్లకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి





(షణ్ముఖ వెలుగు, మార్కాపురం, అక్టోబర్ 15)

పల్లె పండుగ పేరిట గ్రామాల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టుతున్న మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలలో భాగంగా మార్కాపురం మండలంలోని రాయవరం, కొల భీమునిపాడు, పెదనాగులవరం, బోడపాడు గ్రామాల్లో పలు సిమెంటు రోడ్లకు భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చే నాలుగు సంవత్సరాలలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బిజెపి పెద్దల సహకారంతో మార్కాపురం నియోజకవర్గంలోని అంతర్గత రోడ్లను, డ్రైనేజీలను, తాగునీటికి ఇబ్బంది లేకుండా ప్రతిదీ పూర్తి చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కొలభీమునిపాడు గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. గ్రామానికి చెందిన వైద్య సిబ్బంది గైర్హాజరవడంతో వారికి మెమో జారీ చేయాలని ఎమ్మెల్యే ఇన్‌ఛార్జి ఎంపీడీవోకి ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన మార్కాపురం నియోజకవర్గ ఇన్చార్జ్ ఇమ్మడి కాశీనాథ్, మండల కన్వీనర్ రామాంజనేయులు రెడ్డి, నాయకులు కాకర్ల శ్రీను యాదవ్, మైనార్టీ నాయకులు మస్తాన్, ప్రకాశం జిల్లా డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్, ఇన్‌ఛార్జి ఎంపీడీవో భాగ్యవతి, ఏపీవో, జీవ రత్నం, మండల అధికారులు, పలు గ్రామాల సచివాలయ సిబ్బంది, పలు గ్రామాల తెలుగుదేశం నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# పల్లెలకు పండగే

- ఐదేళ్లలో అన్ని గ్రామాలలో సిమెంట్ రహదారులు - రూ.70 లక్షలతో సీసీ రోడ్ల శంకుస్థాపన
- టిడిపి ఇన్‌ఛార్జి ఎరిక్షన్ బాబు - దేవరాజుగట్టు గ్రామలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన




(షణ్ముఖ వెలుగు, పెద్దారవీడు, అక్టోబర్ 15)

గ్రామీణ ప్రాంతాలలో మట్టి రోడ్లు లేకుండా చేస్తామని యర్రగొండపాలెం టీడీపీ ఇంచార్జి ఎరీక్షన్ బాబు అన్నారు. పెద్దారవీడు మండలంలోని దేవరాజు గట్టు,పెద్దారవీడు, బోయిదగుంపుల, కర్రోలా, గ్రామాలలో మంగళవారం 70 లక్షల రూపాయలతో సిసి రోడ్లు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా పెట్టుకొని ప్రతి గ్రామంలో సిసి రోడ్లు వేయించాలని ఎన్నికల ముందు హామీ ఇచ్చారు ఈ సందర్భంగా ప్రతి గ్రామంలో సిసి రోడ్లకు శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. పేదల పక్షపాతి పార్టీని టిడిపి పార్టీ అని అన్నారు. ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందించడమే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యన్నారు. గత ఐదు సంవత్సరాల్లో రాష్ట్రంలో ప్రజలందరూ తీవ్ర స్థాయి ఇబ్బందులు ఎదుర్కొన్నారు అన్నారు ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ మెట్టు శ్రీనివాసరెడ్డి సర్పంచ్ లక్ష్మీ దేవి, ఎంపిటిసి వెంకటేశ్వరరెడ్డి, మాజీ మండల కన్వీనర్ గొట్టం శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీపీ చంద్రగుంట్ల నాగేశ్వరరావు, మాది జెడ్పిటిసి రవి, వెంకటేశ్వర్లు, మాజీ ఎంపిటిసి సుబ్బారెడ్డి, నాయకులు పాలంకయ్య, గ్రంథె సత్యనారాయణ, సర్పంచులు, ఎంపీటీసీలు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# సైక్లోన్‌కు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### స్పెషల్ ఆఫీసర్ ఏఈ శ్రీనివాసులు హెచ్చరిక



(షణ్ముఖ వెలుగు, సూళ్లూరుపేట ఇన్‌ఛార్జి, అక్టోబర్ 15)

నాయుడుపేట మండలంలోని విన్నమాల గ్రామ సచివాలయం పరిధిలో ఉండే పెరికిలింపాటి కండ్రిగ, కమ్మవారి పాలెం గ్రామాల్లోని ప్రజలకు ఈ నెల 14వ తేదీ నుంచి 17వ తేదీ వరకు భారీ నుండి అతిభారీ వర్షాలు, ఈదురుగాలులు సంభవించే ప్రమాద హెచ్చరికలు వాతావరణ శాఖ వారిచ్చిన సూచనలు మేరకు ప్రజలందరూ జాగ్రత్తగా ఉండాలని, ఎలాంటి ప్రాణ హాని, ఆస్థి నష్టం వాటిల్లకుండా అప్రమత్తంగా ఉండాలని, తీవ్రమైన వర్షం వల్ల ఇబ్బందులు ఎదురైతే వెంటనే సమాచారం అందించేలా సచివాలయం సిబ్బందిని ఏర్పాటు చేశామని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్టు ప్రజలకు తెలిపారు. ఈ కార్యక్రమం ఆళ్ల రాజగోపాల్‌రెడ్డి, బల్లి ముత్యాలయ్యల ఆధ్వర్యంలో, సైక్లోన్ స్పెషల్ ఆఫీసర్ హౌసింగ్ ఏఈ శ్రీనివాసరావు, పంచాయతీ సెక్రటరీ గోవిందయ్య, సచివాలయం సిబ్బంది పరమ శివయ్య, సాయి కుమార్, సందీప్, జ్యోతి,సాయి వాణిశ్రీ, చెంచు లక్ష్మి, మబ్జాన్, మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

## అబ్దుల్ కలాం ఆశయాలు ప్రతి ఒక్కరూ కొనసాగించాలి

**రాష్ట్ర టిడిపి ముస్లిం మైనారిటీ అధ్యక్షులు మౌలానా ముస్తాక్ అహ్మద్ మాజీ రాష్ట్రపతి, దివంగత ఏపీజే అబ్దుల్ కలాంకు నివాళులు**





(షణ్ముఖ వెలుగు, పొదిలి, అక్టోబర్ 15)

పొదిలి ఇమాంసా హాస్పిటల్‌లో మాజి రాష్ట్రపతి దివంగత ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా చిత్రపటానికి రాష్ట్ర టీడీపీ ముస్లిం మైనారిటీ అధ్యక్షులు మౌలానా ముస్తాక్ అహ్మద్ పూలమాల వేసి నివాళులర్పించారు. విజయవాడ నుండి అనంతపురం జిల్లా కదిరిలో జరిగే పార్టీ కార్యక్రమాలకు హాజరయ్యే క్రమంలో మార్గ మధ్యలో పొదిలిలో రాష్ట్ర ముస్లిం మైనారిటీ అధ్యక్షులు మౌలానా ముస్తాక్ అహ్మద్ ఆగారు. అనంతరం స్థానిక ముస్లిం నేతలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వంలో ముస్లింలకు ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందన్నారు. గత ప్రభుత్వంలో ముస్లింలను వైయస్ జగన్మోహన్‌రెడ్డి అన్యాయం చేశారని ఆరోపించారు. తెలుగుదేశం ప్రభుత్వంలో ముస్లింలు, ప్రజలు స్వేచ్ఛగా వారి పని వారు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ ముస్లిం మైనార్టీ సెల్ అదేక్షలు మౌలానా ముస్తాక్ అహ్మద్,జిల్లా అధ్యక్షులు షేక్ రసూల్ మహమ్మద్, పట్టణ అధ్యక్షులు డాక్టర్ ఇమాంసా,జిల్లా కార్యదర్శి మహబూబ్ బాషా, షబ్బీర్,మస్తాన్,ముల్లా షబ్బీర్, మెహెరున్,ఖాసీం, అహ్మద్, జహీర్, నజీర్, ఫారీసా తదితరులు పాల్గొన్నారు.

## లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రదేశాలకు తరలింపు

### పర్యవేక్షిస్తున్న ఉలవపాడు ఎస్ఐ కె అంకమ్మ




(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, అక్టోబర్ 15)

మండల పరిధిలోని తిరుపతి గుంట కాలనీలో నివాసం ఉంటున్న 50 గృహాల్లోని 40 మందిని ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు కారణంగా నీట మునిగిన గృహాలలోని వారిని సురక్షిత ప్రాంతమైన మన్నేటికోట తుఫాన్ షెల్టర్ కు తరలించారు. ఈ కార్యక్రమంలో ఉలవపాడు ఎస్ఐ కె అంకమ్మ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## మద్యం దుకాణం మార్చాలని మహిళల ఆందోళన



(షణ్ముఖ వెలుగు, కంభం, అక్టోబర్ 15)

కంభం పట్టణంలోని స్థానిక ఆర్టీసి బస్టాండ్ సమీపంలో ఉన్న మద్యం షాపు ఇక్కడ ఏర్పాటు చేయవద్దు అంటూ స్థానిక సాయిబాబా నగర్ కి చెందిన మహిళలు అరాఫత్ నగర్‌లోని ఎక్సైజ్ అధికారులకు విజ్ఞప్తి చేసారు. ఈ ప్రాంతంలో మహిళలు స్కూల్ పిల్లలు ఎక్కువగా తిరుగుతూ ఉంటారని ఇక్కడి మందుబాబులు మద్యం సేవించి మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని సంభంధిత అధికారులు జోక్యం చేసుకొని నూతన మద్యం దుకాణం ఇక్కడ కాకుండా వేరే చోటికి మార్చాలని ఎక్సైజ్ సీఐ కొండారెడ్డి కి విన్నవించుకొని వినతిపత్రం ఇచ్చారు.

# ఖరీఫ్ 2024
## ఈ క్రాప్ నమోదు
### సామాజిక జాబితాల పరిశీలన
### ఏవో వెంకటేష్



(షణ్ముఖ వెలుగు, మద్దిపూడి, అక్టోబర్ 15)
మండలంలోని గార్లపేట రైతు సేవా కేంద్రంలోని వేమవరం రెవెన్యూ గ్రామ పంచాయతీలోని మండల వ్యవసాయ అధికారి సి హెచ్ వెంకటేష్ ఆధ్వర్యంలో ఖరీఫ్ 2024 ఈ -పంట నమోదు చేసిన రైతులు జాబితాను సామూహిక తనిఖీలను మంగళవారం నిర్వహించారు. మద్దిపూడి మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల యందు ప్రదర్శించిన జాబితాలలో తప్పులు ఉంటే రైతులు సరిచేసుకునే విధంగా గ్రామ సభలు నిర్వహించటం జరుగుతుందన్నారు. ఖరీఫ్ 2024 జాయింట్ అజ్మోమోషీ పద్ధతిలో వి ఆర్ వో లు, సర్వేయర్లు, గ్రామ అగ్రికల్చర్ అసిస్టెంట్లు చేత క్షేత్రస్థాయిలో ఈ పంట నమోదు చేయించుకున్న రైతులు ఏమైనా పొరపాట్లు ఉన్నట్లయితే 16 వ తేదీ లోపు రైతు సేవా కేంద్రం సిబ్బందిని కలిసి రాత పూర్వకంగా అర్జీ ఇచ్చి సరి చేసుకోవలసిందిగా తెలిపారు. అనంతరం గ్రామ సభ నందు గ్రామ వ్యవసాయ సహాయకురాలు ఏ. స్వాతి చేత గ్రామ రైతుల యొక్క ఈ పంట నమోదు వివరాలు చదివి వినిపించటం జరిగింది. ఈ ముఖ్య కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ రైతులు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

# ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి
### నెల్లూరు నగర నియోజకవర్గ ప్రజలకు
### ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి విజ్ఞప్తి



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, అక్టోబర్ 15)
నెల్లూరు జిల్లాకు తుఫాను హెచ్చరికల నేపథ్యంలో నెల్లూరు జిల్లా ప్రజలకు, మరి ముఖ్యంగా నెల్లూరు నగర నియోజకవర్గ ప్రజలందరికీ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. తుఫాను సమయంలో తీవ్రమైన పెనుగాలులు వీచే అవకాశం ఉంది. పిడుగులు పడే ప్రమాదం ఉంటుంది. కాబట్టి ప్రజలందరూ అప్రమత్తంగా వుండి అవసరమైతే తప్ప ఇంట్లో నుంచి బయటకి వెళ్లకుండా మరి ముఖ్యంగా కరెంటు స్తంభాలు,సెల్ ఫోన్ టవర్స్ చెట్ల కింద ఉండకుండా ఇంట్లోనే సురక్షితంగా ఉంటూ జాగ్రత్తలు పాటిస్తూ అప్రమత్తంగా వుండాలని కోరారు. అలాగే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలను అప్రమత్తం చేసి తుఫాను వలన ప్రజలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా వారిని కాపాడాలని కోరారు.

# కందిపంటను పరిశీలించిన వ్యవసాయశాఖ ఏఓ వెంకటేష్





(షణ్ముఖ వెలుగు, మద్దిపూడి, అక్టోబర్ 15)
మండలంలోని కాకర్ల, శివరాయుని పేట రెండు గ్రామాలల్లో రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి వ్యవసాయ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో పొలం బడి పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించటం జరిగిందని మద్దిపూడి మండల వ్యవసాయ అధికారి సిహెచ్ వెంకటేష్ తెలిపారు. వ్యవసాయ అధికారి వెంకటేష్ రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఈ పొలం బడి పిలుస్తుంది కార్యక్రమం వల్ల క్షేత్రస్థాయిలోనే అవగాహనతో రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని అన్నారు.కాకర్ల మరియు శివ రాయుని పేట గ్రామాలల్లో క్షేత్రస్థాయిలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్ కంది పంటలల్లో రైతులకు పొలం బడి పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి, ప్రస్తుత అధిక వర్షాల దృష్ట్యా పొలాల్లో నీరు నిల్వ ఉండాకుండా ఎప్పటికి అప్పుడు నీరు తీసివేయాలనియు ఒక లీటర్ నీటికి పోటాషియం నైట్రేట్ 10 గ్రాములు పిచికారీ చేసుకోవాలని మరియు ఎండు తెగులు ఎక్కువ సోకే అవకాశం ఉన్నందున ఒక లీటర్ నీటికి ఒక గ్రామ్ కార్బన్ డిజైమ్ కలిపి పిచికారీ చేసుకోవాలని తెలిపారు. అనంతరం కంది , ఇతర పంటల చీడ పీడ తగు నివారణ చర్యలు కరపత్రాలను పంపిణీ చేశారు. అలాగే వ్యవసాయ మరియు అనుబంధ శాఖలు వారు కూడా సంబందించిన సమాచారం రైతులకు అవగాహనా చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన విస్తరణ అధికారిణి ధనలక్ష్మి, పశు సంవర్ధక శాఖ సిబ్బంది, గ్రామ వ్యవసాయ సహాయకుడు కె.బ్రహ్మం ,గ్రామ రైతులు పాల్గొన్నారు.

# కిట్స్‌లో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో భారతరత్న ఏపీజే అబ్దుల్ కలాం జయంతి



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం, అక్టోబర్ 15)
స్థానిక కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల లో మంగళవారం రోజున కిట్స్ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో భారతరత్న ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించినట్లు కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ అన్న కృష్ణ చైతన్య గారు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పివి అనిల్ కుమార్ గారు పాల్గొని ముందుగా భారతరత్న ఏపీజే అబ్దుల్ కలాం పటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. తదనంతరం మాట్లాడుతూ దేశ రక్షణ వ్యవస్థకు అను శక్తిని జోడించిన మిస్సైల్ మ్యాన్ అని అలానే భారతదేశానికి రాష్ట్రపతిగా తన సేవలు అందించారని, పేపర్ బాయ్‌గా పని చేస్తూ ఏరో స్పేస్ ఇంజనీరింగ్ పూర్తి చేశారని, క్షిపణి శాస్త్ర విజ్ఞాన రంగంలో చిరస్మరణీయ సేవలు అందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ వి కృష్ణారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.రంగనాయకులు, కళాశాల ఏవో బి ప్రభాకర్, వివిధ విభాగపు అధిపతులు పి రామ్మోహన్, డాక్టర్ జెవి అనిల్ కుమార్,కే రాముడు, కే కిషోర్ బాబు, ప్రసన్న మురళి , జే రమణారెడ్డి,ఏ. అమృతవల్లి , పి మనోహర్, ఫిజికల్ డైరెక్టర్స్ ఎన్ రంగస్వామి, ఎన్ వి ఎస్ ఎన్ అంజనీ కుమార్, ఉపాధ్యాయ ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

# కనిగిరిలో ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వేడుకలు



(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, అక్టోబర్ 15)
మాజీ రాష్ట్రపతి భారతరత్న అవార్డు గ్రహీత ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వేడుకలు మంగళవారం కనిగిరి పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ ఛైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ మున్సిపల్ కమిషనర్ డానియల్ జోసఫ్ డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమిళనాడు రాష్ట్రంలో ఒక నిరుపేద కుటుంబంలో జన్మించిన అబ్దుల్‌కలాం భారత అణురంగంలో అత్యున్నతస్థాయికి చేరి అనేక సేవలు అందించిన గొప్ప శాస్త్రవేత్త అని అన్నారు. అలాగే ఆయన భారత రాష్ట్రపతిగా దేశానికి మంచి సేవలు అందించిన చిరస్మరణీయుడని అన్నారు. ఏపీజే అబ్దుల్ కలాం వినయం, ముందుచూపు, విజ్ఞానం, విద్య మీద ఉన్న చంచలమైన అంకితభావం లక్షలాది మంది హృదయాలలో చెరగని ముద్ర వేశారని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ ప్రసాద్,ఏ ఈ కోటేశ్వరరావు, శానిటరీ ఇన్స్పెక్టర్ నాయిబ్ రసూల్ కౌన్సిలర్సు తమ్మినేని సుజాత దేవకి రాజీవ్ పిచ్చి రెడ్డి అరునోధర్ మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నియోజకవర్గ రహదారుల నిర్మాణానికి రూ.117.75 కోట్లు మంజూరు

### కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి కృతజ్ఞతలు
### ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి



(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, అక్టోబర్ 15)
మాచర్ల నియోజకవర్గంలో రహదారుల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.117.75 కోట్లు మంజూరు చేసినట్లు మాచర్ల నియోజకవర్గం ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి తెలిపారు. సెంట్రల్ రోడ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ ద్వారా నిధులు మంజూరు చేసినట్లు బ్రహ్మానంద రెడ్డి తెలిపారు. దుర్గి నుండి వెల్దుర్తి వరకు 17. 6 కిలోమీటర్లకు గాను 31 కోట్ల 60 లక్షలు, పాలు భాయ్ జంక్షన్ నుండి సత్రశాల వరకు 11.2 కిలోమీటర్లకు గాను 21.65 కోట్ల రూపాయలు, మాచర్ల నుండి విజయపురి సౌత్ 22.8 కిలోమీటర్ల గాను 31 కోట్ల రూపాయలు, లోయపల్లి నుండి లచ్చంబావి తండా వరకు 25. 40 కిలోమీటర్లకు గాను 33. 5 కోట్ల తో రహదారులు నిర్మించినట్లు ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని రహదారుల నిర్మాణానికి నిధులు కేటాయించేందుకు కృషిచేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, పార్లమెంట్ సభ్యులు లావు శ్రీ కృష్ణదేవరాయలకు బ్రహ్మారెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు.

# పనుల కోసం ఎవరూ నావద్దకు రావొద్దు మీ ఇంటి వద్దనే పనులు చేయిస్తా

### పల్లె పండుగలో ఎమ్మెల్యే దామచర్ల



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 15)
పనుల కోసం ఎవరూ నావద్దకు రావొద్దని, మేమే మీ ఇంటికి వచ్చి అక్కడే పనులు చేయిస్తామని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ రావు అభయం ఇచ్చారు. పల్లె పండుగలో భాగంగా ఒంగోలు మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంఖుస్థాపన చేశారు. అనంతరం గ్రామాల ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ప్రతి గ్రామంలో సచివాలయం ఉందని, అక్కడ పనిచేసే సిబ్బంది గ్రామ ప్రజలకు సంబంధించిన పూర్తి స్థాయి డేటా దగ్గర ఉంచుకోవాలని దామచర్ల సూచించారు. సచివాలయం సిబ్బంది ఉదయం 10.30 నుండి సాయంత్రం 5గంటల వరకు ఖచ్చితంగా ఉండాలని, ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సస్పెండ్ చేస్తామని దామచర్ల సున్నితంగా హెచ్చరించారు.

# పల్లె పండుగ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి





(షణ్ముఖ వెలుగు, హనుమంతునిపాడు, అక్టోబర్ 15)
మండలంలోని తిమ్మారెడ్డి పల్లె పంచాయతీ ఎలికా వారి పల్లె గ్రామంలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా రూ.1 కోటితో రూపాయలతో కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పాల్గొని బీట్ రోడ్డుకు శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. నందనవనం నుండి గములపాలెం వరకు సిసి రోడ్లు కు 30 లక్షల రూపాయలు శంకుస్థాపన కార్యక్రమంలొ పాల్గొన్నారు . ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ గత పాలనలో సంక్షేమం పేరుతో రాష్ట్రం అభివృద్ధి మరిచారని విమర్శించారు. సీఎం చంద్రబాబు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పల్లె పండుగ పేరుతో గ్రామాల అభివృద్ధికి నాంది పలికారని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎంపీపీ గాయం సావిత్రి అధికారులు మరియు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సానికొమ్ము తిరుపతి రెడ్డి ఎంపీటీసీ ఉడుముల సుబ్బారెడ్డి, మండల టిడిపినాయకులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# చేతులు కడుక్కుందాం ఆరోగ్యంగా ఉందాం

### గుడ్ హెల్ప్ ఛైర్మన్ ప్రవీణ్ కుమార్







(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, అక్టోబర్ 15)
చేతులు పరిశుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యంగా ఉంటామని గుడ్ హెల్ప్ ఫౌండేషన్ ఛైర్మన్ మంద్రు ప్రవీణ్ కుమార్ అన్నారు.కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని దేవాంగనగర్ లో మంగళవారం ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవాన్ని గుడ్ హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ మన అరచేతుల్లో కంటికి కనిపించని క్రిములెన్నో ఉంటాయని దీనిని నిర్లక్ష్యం చేస్తూ చేతులు శుభ్రం చేసుకోకుండా ఆహారం తింటే ఆరోగ్యానికి హానికరమని ఆరోగ్యం బాగుండాలంటే క్రమం తప్పకుండా చేతుల్ని శుభ్రం చేసుకోవాలన్నారు. పిల్లలకు చేతులు శుభ్రం చేసుకొనే విధానాలపై చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. చేతులు పరిశుభ్రంగా కడుక్కోవడంతో అంటురోగాల నుంచి నివారించుకోవచ్చన్నారు. ఆహారం తినే ముందు తప్పనిసరిగా చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.అనంతరం పిల్లలకు డెటాల్ సబ్బులు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో పారా లీగల్ వాలంటీర్, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ డైరెక్టర్ రమేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

# వర్షపు నీరు కాలువలోకి వెళ్లేలా చర్యలు తీసుకోవాలి

### నగరంలో పర్యటించిన కమీషనర్ కె వెంకటేశ్వరావు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 15)
ఒంగోలు నగరంలో కురుస్తున్న వర్షాల కారణంగా నగరంలో వర్షపు నీరు నిలబకుండా ఉండేలా నగరపాలక సంస్థ చేపడుతున్న జాగ్రత్త చర్యలను మంగళవారం కమీషనర్ కె.వెంకటేశ్వరావు నగర పాలక సంస్థ మేయర్ గంగాడ సుజాత పరిశీలించారు. ఈ పర్యటనలో భాగంగా, ఆర్టీసీ బస్టాండ్ , కర్నూల్ రోడ్ నందు వాన పడినపుడు రోడ్ మీద నీరు పోకుండా ఉండే ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా, కర్నూల్ రోడ్ నందు మాల్స్, ఇతర షాప్‌లు అన్ని కూడా అక్కడ ఉన్న ప్రధాన కాలువ మీద రాకపోకలకు అనుగుణముగా రాంప్‌ని ఏర్పరుచుకొనుట వల్లన వర్షపు నీరు మొత్తం కూడా కాలువలోకి వెళ్లకుండా ఆగుతున్నాయి అని గమనించి ఆయా రాంప్‌లను వెంటనే తొలగించాల్సిందిగా ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్, శానిటరీ విభాగం, టౌన్ ప్లానింగ్ సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు. ప్రభుత్వం నుంచి వచ్చిన ముందస్తు సమాచారం ప్రకారం ఈరోజు, ఇంకా రెండు రోజులు ఒంగోలు నగరంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశాలు ఉన్నాయ్ అని అన్నారు. వెంటనే ఇలా కాలువలపై ఎక్కడైనా ర్యాంప్‌లు లేక ఇతర ఆక్రమణలు ఉన్నయెడల వాటిని వెంటనే తొలగించి వర్షపు నీరు కాలువలోకి వెళ్లేవిధముగా చర్యలు తీసుకోవాలి అని నగరపాలక సిబ్బందికి మేయర్, కమీషనర్ ఆదేశాలు ఇచ్చారు.









# పల్లె పండుగలో అభివృద్ధి పనులు

## కోటి 45 లక్షల పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే దామచర్ల




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 15)
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పల్లె పండుగలో అభివృద్ధి పనులకు అడుగులు పడుతున్నాయి. ఒంగోలు మండలంలో స్థానిక శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ రావు కోటి 45 లక్షల రూపాయలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ముందుగా ఉలిచి గ్రామంలో 15 లక్షల రూపాయలతో అంతర్గత రోడ్ల నిర్మాణాలకు దామచర్ల శంఖుస్థాపన చేశారు. అనంతరం కరవది గ్రామంలో కోటి 30 లక్షల రూపాయలతో అంతర్గత రోడ్లు, ఇతర నిర్మాణ పనులకు దామచర్ల శంఖుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాల్లో ఒంగోలు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కామేపల్లి శ్రీనివాసరావు, ఉలిచి సర్పంచ్ మురళి, కరవది సర్పంచ్ కోటేశ్వరరావు, ఆయా గ్రామాల తెలుగుదేశం పార్టీ నాయకులు, మండల అధికారులు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.




# మర్రిపూడి ఎస్సీ కాలనీలో సైడ్ కాలువల నిర్మాణ పనులకు శంకుస్థాపన

## రూ.15 లక్షల నిధులతో ఏర్పాటు



(షణ్ముఖ వెలుగు, మర్రిపూడి, అక్టోబర్ 15)
మండల కేంద్రమైన మర్రిపూడి ఎస్సీ కాలనీలో 25 లక్షల నిధులతో సైడ్ కాలువల నిర్మాణ పనులకు మంగళవారం తెలుగుదేశం పార్టీ నాయకులు,వివిధ శాఖల అధికారులు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా శిలాఫలకాన్ని మండల టిడిపి కన్వీనర్ చేరెడ్డి నర్సారెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జగదీష్, తహసీల్దార్ జ్వాలా నరసింహారావు, ఏఇ పిఆర్ జాలయ్య, మాజీ జెడ్పిటిసి సభ్యులు తూల్లూరి నరసింహారావు, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి, టిడిపి సీనియర్ నాయకులు రేగుల వీరనారాయణ, జిల్లా జర్నలిస్టు ఫోరమ్ అధ్యక్షులు గురిజాల బాబురావు మాదిగ, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు గురిజాల పోలయ్య, ఆర్ ఐ రమణ, సర్పంచ్ భాస్కర్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, వీఆర్వో బడే సాహెబ్, విద్యుత్‌శాఖ సిబ్బంది గురిజాల జార్జి, టిడిపి సీనియర్ నాయకులు సారెడ్డి యోగిరెడ్డి, సారెడ్డి పుల్లారెడ్డి, చేరెడ్డి నర్సారెడ్డి, గోపిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కొణిదెన మోహన్‌రావు, టిడిపి ఎస్సీ విభాగం నాయకులు కొంద్రు హానక్, కోటయ్య, జాన్, రూబెన్, డ్వాక్రా గ్రూప్ మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

# నేడు జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు, జూనియర్ కళాశాలకు సెలవు

## జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్



(షణ్ముఖ వెలుగు, తిరుపతి, అక్టోబర్ 15)
బుధవారం తిరుపతి జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు, జూనియర్ కళాశాలలకు సెలవు ప్రకటిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బంగాళా ఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో వాతావరణ శాఖ, విపత్తు నిర్వహణ శాఖ హెచ్చరికల మేరకు ముందస్తు చర్యల్లో భాగంగా తిరుపతి జిల్లా పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు, జూనియర్ కళాశాలలకు ఎయిడెడ్ యాజమాన్యాల కింద నిర్వహిస్తున్న అన్ని పాఠశాలలకు జూనియర్ కళాశాలలకు అక్టోబర్ 16న (నేడు) బుధవారం సెలవు దినంగా ప్రకటిస్తూ, ఈ ఉత్తర్వులను సంబంధిత యాజమాన్యాలన్నీ విధిగా పాటించాలని కలెక్టర్ ఆ ప్రకటనలో ఆదేశించారు.

# అబ్దుల్ కలాం బాటలో యువత నడవాలి

## ఏఎంసీ చైర్మన్ యారవ

(షణ్ముఖ వెలుగు, పామూరు, అక్టోబర్ 15)
పామూరు పట్టణంలోని స్వయంకృషి సేవా సంస్థ కార్యాలయంలో అబ్దుల్ కలాం చిత్రపటానికి మాలవేసి ఘనంగా నివాళులర్పించారు. నేటి యువత మాజీ రాష్ట్రపతి ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం బాటలో నడవాలని నిరుపేద కుటుంబంలో జన్మించిన కలం భారత దేశ ప్రథమ పౌరుడి స్థాయికి ఎదిగిన పయనం నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రపంచ కరిగించదగ్గ గొప్ప శాస్త్రజ్ఞుడు జీవితాంతం దేశ ప్రతిష్ట కోసం తప్పించిన దేశభక్తుడు ఏపీజే అబ్దుల్ కలాం అని ఆయన అన్నారు ఏఎంసీ చైర్మన్ యారవ శ్రీనివాసులు అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ పిడుగు శ్రీనివాసులు ,మైనార్టీ నాయకులు గౌస్ బాషా, ఆర్ఆర్ రఫీ, మాచర్ల రహిమాన్, పులి నాయబ్, మితికాల నారాయణ, మిలిటరీ కాస్యం, వాయునేని రాఘవ, సయ్యద్ జిలాని భాష, షేక్ జిలాని, కె వెంకటనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



# వైసీపీ కార్యాలయంలో అబ్దుల్ కలాం జయంతి వేడుకలు

(షణ్ముఖ వెలుగు, పామూరు, అక్టోబర్ 15)
మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా పామూరు వైసీపీ కార్యాలయంలో మండల వైసీపీ నేతలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు భారతజాతి గర్వించదగ్గ గొప్ప మేధావి, క్షిపణి పితామహుడు, భావితరాలకు మార్గదర్శి, భారతరత్న ఏపీజే అబ్దుల్ కలాం స్ఫూర్తి దేశానికే ఆదర్శమని గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు కల్లూరి రామిరెడ్డి, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్, పట్టణ అధ్యక్షుడు షైక్ చాంద్ బాషా, మండల బూతు కమిటీ అధ్యక్షులు గట్లా విజయభాస్కర్ రెడ్డి, కోఆప్షన్ సభ్యులు నాయబ్ రసూల్, జొన్నలగడ్డ గోవిందయ్య, ఎస్టీ సెల్ శ్రీరామ్ శ్రీనివాసులు, సర్పంచ్ పైడాల వెంకటరెడ్డి, చల్లా నారాయణ, కోడూరి లక్ష్మీ నారాయణ రెడ్డి, తుపాకుల ఆంజనేయులు, షేక్ కాలేషా, కుందురు మాల్యాద్రిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.




# 16 నుంచి జిల్లాలో భారీ వర్షాలు

## జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 15)
ఈ నెల 16వ తేదీన భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరిస్తూ వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసిందని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా చెప్పారు. ఈ దృష్ట్యా అత్యవసరమైతేతప్ప ప్రజలెవరూ ఇళ్లలోనుంచి బయటకు రావద్దని ఆమె సూచించారు. వర్షాల వలన ఎలాంటి పరిస్థితి తలెత్తినా సమర్థంగా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం సర్వసన్నద్ధమై ఉందని మంగళవారం ఒక ప్రకటనలో చెప్పారు. సోమవారం ఉదయం 8.30 గంటల నుంచి మంగళవారం ఉదయం 8.30 గంటల వరకు జిల్లాలో సగటున 51 మిల్లీ మీటర్ల వర్షం కురిసిందని కలెక్టర్ తెలిపారు. శింగరాయకొండ, పొన్నలూరు, ఎన్.జి.పాడు, ఒంగోలు, టంగుటూరు, జరుగుమల్లి, కొండపి, కొత్తపట్నం.. సి.ఎస్.పురం, మద్దిపాడు, పొదిలి, తాళ్లూరు, పామూరు, ఎస్.ఎస్.పాడు, పి.సి.పల్లి, ముండ్లమూరు మండలాలలో 80 మి.మీ. ల కంటే అధిక వర్షం కురిసినట్లు చెప్పారు. చీమకుర్తి, మర్రిపూడి, హెచ్.ఎం.పాడు, వెలిగండ్ల, కవిగిరి, కె.కె.మిట్ల, కురిచేడు, దొనకొండ, మార్కాపురం, దర్శి మండలాలలో 40-80 మి.మీ. లవర్షం కురిసినట్లు వివరించారు. మిగతా మండలాలలో 40 మి.మీ. లకన్నా తక్కువ వర్షం కురిసినట్లు తెలిపారు.

**18 గ్రామాలపై ప్రభావం**

ఈ బారీ వర్షాలు జిల్లాలోని తీరప్రాంత నాగులుప్పలపాడు, ఒంగోల ఒంగోలు, కొత్తపట్నం.. టంగుటూరు, శింగరాయకొండ మండలాలలోని 18 గ్రామాలపై తీవ్ర ప్రభావం చూపుతుందని గుర్తించామని కలెక్టర్ చెప్పారు. వీటి పరిధిలోని వీధిలోని 54 హాబిటేషన్ లలో ఉంటున్న 56,584 మంచి ప్రభావితమయ్యే అవకాశం ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. ఈ హాబిటేషన్ల పరిధిలో ప్రక్కా గృహాలు 9,860, సెమీ పక్కా గృహాలు 3,677, కచ్చా ఇళ్లు 1,058 గుర్తించినట్లు చెప్పారు. ఈ మండలాలలో 33 పునరావా కేంద్రాలను ముందస్తుగా గుర్తించామని, 5 కేంద్రాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. కొత్త పట్నంలో శింగరాయకొండి. (పాకల)లో1, ఎన్.జీ.పాడులో నిర్వహిస్తున్నామన్నారు. ఈ పునరావాస కేంద్రాలలో 214 -మందికి ఆశ్రయం కల్పించి నాణ్యమైన భోజనం, తాగునీరు అందిస్తున్నామని చెప్పారు. ఈ కేంద్రాలలో అపపరమైన సదుపాయాలను కల్పించామన్నారు.




**జిల్లాకు ఎస్.డి.ఆర్.ఎఫ్. బృందం**

పరిస్థితిని బట్టి అవసరమైన సహాయక చర్యలలో పాల్గొనేందుకు 30 మందితో కూడిన ఒక ఎస్.డి.ఆర్.ఎఫ్. బృందం కూడా జిల్లాకు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. వర్షాలవల్ల ఎలాంటి ఇబ్బంది ఎదురైనా ప్రభుత్వ యంత్రాంగం తక్షణమే స్పందించేలా.. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో 1077 టోల్ ఫ్రీ నెంబరుతో కంట్రోల్ రూమును ఏర్పాటు చేశామని కలెక్టర్ చెప్పారు. పొంగిపొర్లుతున్న వాగులు, వంకలవైపు వెళ్లవద్దని ప్రజలకు సూచించారు. అలాంటి ప్రాంతాలలోని కాజ్వేలు, బ్రిడ్జీలు, కల్వర్టుల వద్ద ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా ప్రజలను అప్రమత్తం చేసేలా పోలీసు, రెవెన్యూ, పంచాయతీరాజ్, ఇరిగేషన్ శాఖల సిబ్బందితో ప్రత్యేక గస్తీ ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు కూడా సహకరించి ప్రమాదకర స్థలాలవైపు వెళ్లకుండా, కూలిపోయే స్థితిలో ఉన్న ఇళ్ల ళలో ఉండకుండా దగ్గరలోని పునరావాస కేంద్రాలలో ఆశ్రయం పొందాలని కలెక్టర్ సూచించారు.

# భూ సేకరణలో నిర్వాసితులకు పరిహారం

## త్వరగా చెల్లించేలా చర్యలు చేపట్టాలి



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 15)
నడికుడి - శ్రీకాళహస్తి రైల్వేమార్గ నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియలో నిర్వాసితులకు పరిహారం త్వరగా చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి కార్యదర్శి ప్రద్యుమ్న చెప్పారు. మంగళవారం అమరావతీ నుంచి సంబంధిత రైలుమార్గం వెళ్తున్న జిల్లాల కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రకాశం భవనం నుంచి కలెక్టర్ శ్రీమతి ఏ.తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ పాల్గొన్నారు. కనిగిరి, పామూరు మండలాలలో భూసేకరణ ప్రక్రియలో పరిహారం చెల్లింపులో జాప్యంపై ప్రద్యుమ్న ఆరాతీశారు. వారంలోగా ఈ సమస్య పరిష్కారమయ్యేలాగా చర్యలు తీసుకోవాలని ఆయన చెప్పారు. అనంతరం భూసేకరణ విభాగ సూపరింటెండెంట్ సంజీవరావుతో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com